విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

మంగళవారం 14 అక్టోబరు 2025 8 పేజీలు

సీనియర్ కమ్యూనిస్టులకు సన్మానం

విశాలాంధ్ర-చల్లపల్లి : కమ్యూనిస్టు పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ కమ్యూనిస్టు నాయకులను పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. నిస్వార్థ ప్రజా సేవకుడు కంఠంనేని అచ్యుతరామయ్య వర్ధంతి కార్యక్రమం చల్లపల్లిలోని సిఆర్‌వికాస కేంద్రంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ కోసం నిరంతరం పనిచేసిన సీనియర్ నాయకులను సత్కరించారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డకు చెందిన తాతినేని వెంకటప్పయ్య, మోపిదేవి గ్రామానికి చెందిన కొలుసు లక్ష్మయ్య లను నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నమ్మిన సిధాంతం కోసం యవ్వనంలో ఎర్రజండా పట్టిన వీళ్ళు ఇప్పటి వరకు కమ్యూనిష్టు నాయకులుగా కొనసాగడం గొప్ప విషయం అన్నారు. రోజుకో జండా, పూటకో పార్టీ మారుస్తున్న నేటి కాలంలో జీవిత చరమాంకం వరకు ఎర్రజెండా ఉండటం కమ్యూనిస్టు పార్టీ నాయకులకే సాధ్యమన్నారు. అనేక అవాంతరాలను, ఆటుపోట్లను అధిగమించి ప్రజా ఉద్యమాలలో తమదైన ముద్ర వేసుకున్న తాతినేని వెంకటప్పయ్య, కొలుసు లక్ష్మయ్యలు నేటి యువ కమ్యూనిస్టులకు మిగతా 2 లో ...

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

మేయర్, కమిషనర్‌లకు సమ్మె నోటీసు : కోట మాల్యాద్రి

మేయర్ కోవెలమూడి రవీంద్ర కు సమ్మె నోటీసు అందజేస్తున్న కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, మిగతా 2 లో ...

పొన్నగంటి రాజేశ్వరమ్మకి అక్కినేని వనజ నివాళి

గన్నవరం మండలం దావాజీ గూడెంలో పొనగంటి రాజేశ్వరమ్మ (94) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ సందర్శించి నివాళులర్పించారు.

-వివరాలు 3లో...

'జగ్జీవన్ మిషన్'తో

సురక్షిత తాగునీరు

ఎంపీ వల్లభనేని బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, దివ్యాంగుల సంక్షేమం, గ్రామీణ నీటిపారుదల, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, విద్య, వైద్యం, ఆరోగ్యం, రహదారులు, భవనాలు, జాతీయ రాష్ట్ర రహదారులు, పరిశ్రమలు, విద్యుత్, పంచాయితీరాజ్, మత్స్య, మున్సిపాలిటీలు, ఎంపీ నిదులు తదితర శాఖలకు చెందిన కేంద్ర ప్రభుత్వ పథకాల సద్వినియోగం, వాటి అమలులో సమస్యలపై పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి చర్చించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అద్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మిగతా 2 లో ...

ధాన్యం కొనుగోళ్లలో

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం కాజా గ్రామ రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి సోమవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు దశలు, సిబ్బంది చేపట్టాల్సిన అంశాలు, పరికరాల పనితీరు, రైతులకు చేసే సూచనలు, బస్తాలు ఏర్పాటు, రవాణా ఛార్జీల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సిబ్బందికి గల అవగాహనను పరిశీలించారు. సమీపంలో ఉన్న వేయింగ్ బ్రిడ్జిని స్వయంగా తనిఖీ చేసి లెక్కింపు విధానాన్ని పరిశీలించారు. అన్నదాతకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఏ రైతు వద్ద ఎంత ధాన్యము వస్తుందో ముందే పరిశీలించి, దానికి కావలసిన గోనె సంచులు ముందే ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో గ్రామ వ్యవసాయ అధికారులు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు నియమించిన సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు ధాన్యం మిగతా 2 లో ...

అమలవ్వని

'సూపర్ జీఎస్టీ' !

- -షాపుల్లో కనబడని ధరల పట్టిక
- -ఇష్టారాజ్యంగా షాపుల యజమానుల విక్రయాలు
- -పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- -విద్యావంతులై అడిగిన వారికే రేట్ల తగ్గింపులు

విశాలాంధ్ర-మాచర్ల : పేద, మధ్యతరగతి కుటుంబాలకు అభివృద్ధి ఫలాలను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సంక్షేమ కార్యక్రమం వ్యాపారస్తులకు వరంగా మారింది. తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రకారం వస్తువులను అమ్మకాలు జరపాల్సిన వ్యాపారులు 20 రోజులు గడిచినా ఆ దిశలో కనబడటం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా వస్తువులు, నిత్యావసర సరుకులు వంటి ఏ వస్తువుపై ఎంత తగ్గిందో షాపుల్లో డిస్‌ప్లే చేయాల్సిన బోర్డు నిబంధనను అమలుకు సుముఖంగా లేనట్లు మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ కమ్యూనిస్టులకు సన్మానం

ఆదర్శనీయులన్నారు. కామ్రేడ్ కంఠం నేని అచ్యుతరామయ్య సమస్మరణ సభ సందర్భంగా సీనియర్ నాయకులను సన్మానించుకోవడం మంచి సంస్కృతిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చెన్నం కోటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్. పిచ్చియ్య మోపిదేవి ఎంపీపీ రావి దుర్గా వాణి, మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, కంఠంనేని కుటుంబరావు, మహిళా సమాఖ్య నాయకురాలు మల్లుపెద్ది రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ఆర్. పిచ్చయ్య, మల్లుపెద్ది రాజ, ఆర్ఎంపి శేషు లు ఆలపించిన విప్లవ గీతాలు ఆహుతులను ఆలోచింపజేశయి.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏఐటీయూసీ నాయకులు, కార్మికులతో కలసి సోమవారం గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థలు, పురపాలకశాఖలో రెండేళ్లుగా విధుల్లో ఉండి మరణించి పదవీ విరమణ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, 12వ పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని, 2011 నుంచి జనగణన లేకపోవడంతో ప్రాంతాల విస్తీర్ణం పెరగనందున ఆయా మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీలలో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు సత్వరమే విడుదల చేయాలని, డైలీ వేస్ కార్మికులను అవుట్ సోర్సింగ్ లోకి తీసుకోవాలని, 2023న నాటి ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా వర్క్ ఆఫ్ నేచర్ బట్టి ప్రస్తుతం పని చేస్తున్న ఇంజనీరింగ్ ఆఫీస్ సిబ్బంది స్కూల్ స్వీపర్స్ వంటివారికి వేతనాలు పెంచి చెల్లింపులు చేపట్టాలని, బదిలీ కార్మికులను అప్కాసులో పూర్తి కాలపు వర్కర్లుగా నమోదు చేయాలని, రోడ్లు పైన వేస్తున్న మచ్చర్లను శానిటరీ కార్యాలయాల వద్ద వేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరావు, సద్గుణ రావు తిరుమలరావు, భరత్, పూర్ణచంద్రరావు శివప్రసాద్ నాయక్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'జగ్జీవన్ మిషన్'తో సురక్షిత తాగునీరు

జిల్లా కలక్టర్ డీకె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, పలువురు ప్రజా ప్రతినిదులతో కలిసి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగంపై ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సంర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆయా శాఖల జిల్లా అధికారులు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించి సక్రమంగా సద్వినియోగం చేసుకునే విదంగా కృషి చేయాలని, అర్హత కలిగిన లబ్దిదారులను గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక తదితర తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు అధికంగా ఉన్నారని, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, ముద్ర పథకాల కింద విరివిగా రుణాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే యువతకు రుణాలు అందించాలని, రైతులు, మత్స్యకారులను సహృదయంతో పరిశీలించి రుణాలను మంజూరు చేయాలని, గేదెలు,గొర్రెలు కొనుగొలుకు రుణాలు అందించాలని సూచించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తి కానున్నదని, పోర్టు అనుసంధాన పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యల కోసం వైజాగ్ వంటి పోర్టులను సందర్శించి పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద అర్హులైన లబ్దిదారులకు సౌరఫలకాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జల్జీవన్ పథకం కింద కృష్ణానది నుంచి నేరుగా పైపులైన్ ఏర్పాటుతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంటింటికి సురక్షిత మైన తాగునీటిని అందించేందుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారు చేసి అందించాలని ఎంపి బాలశౌరి అధికారులను ఆదేశించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో పలుగ్రామాల పంటపొలాలు సముద్రంనీటితో చౌడు భూములుగా మారుతున్నాయని, నాబార్డు బ్యాంకు వద్ద ఉన్న క్లైమేట్ చేంజ్ నిధులను వినియోగించుకునేందుకు అవకాశం ఉందని, సంబందిత అధికారులు ఆ ప్రాంతానికి రానున్నారని, వ్యవసాయ శాఖ అధికారులు వారితొ కలిసి సమస్య పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి దిగువన పెనమలూరు మండలం చోడవరం, మోపిదేవి మండలం బండికోళ్ల లంక ప్రాంతాల్లో రెండు బ్యారేజ్‌ల నిర్మానానికి ప్రతిపాదించామని పూర్తి డిపిఆర్‌ను సమర్పించాలనిఅదికారులకుచెప్పారు. రైతులను ప్రోత్సహించాలని కొరమేను పెంపకంతో రైతుకు అధిక ఆదాయం పొందడానికి వీలుందని, గత దిశా కమిటీ సమావేశంలో చర్చించిన అజెండా అంశాలపై తీసుకున్న చర్యలను శాఖల వారీగా ఆయన వివరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ డా. ఆనంద్ కుమార్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, వివిద ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పలువురు జడ్పీటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

విక్రయించడానికి వచ్చే రైతులకు ఇబ్బందులు సృష్టించరాదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వీఏఏలు జాగ్రత్త వహించాలని, రైతులకు ఎంతో ఓర్పుగా సమాధానం చెప్పాలని వారిని ఆదేశించారు. ఈ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ప్రతి మండలంలో మండలస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని, దానికి తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు వారి ధాన్యాన్ని దళారుల ద్వారా అమ్మి మోసపోకుండా తగిన ఏర్పాట్లు జిల్లా వ్యాప్తంగా చేయాలని, అలా కాని పక్షంలో ఆయా సిబ్బంది మీద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రతి అధికారి భాద్యత వహించాలని, ఏ ఒక్క రైతుకూడా ఎటువంటి ఇబ్బందిపడకూడదని తెలిపారు. ధాన్యం కొనుగోలులో వేర్వేరు స్థాయిలో భాగస్వాములు కానున్న వ్యవసాయ, రెవెన్యూ, రోడ్డు రవాణా, లీగల్ మెట్రాలజీ, వివిధ శాఖల వారందరూ పరస్పర సహకారంతో వ్యవహరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయవలసిందిగా సూచించారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.తులసి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో చేపట్టే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఖరీఫ్ 2025-26లో గ్రేడ్-ఏ రకానికి క్వింటాలుకు రూ.2,389లు, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,369లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. జిల్లాలో మొత్తం 177 రైతు సేవ కేంద్రాలను 45 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, కల్లాల వద్ద ధాన్యం వాహనాల్లోకి ఎక్కించటానికి అయ్యే హమాలి ఖర్చు, మిల్ పాయింటుకు చేర్చడానికి రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, ఒకవేళ రైతులు సొంతంగా ఈ ఖర్చులు పెడితే ధాన్యం ఖరీదు, వారి అకౌంట్‌లో 21 రోజులలోపు జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం రవాణాకు జీపీఎస్ అమర్చిన వాహనాలలో మాత్రమే చేయటం ద్వారా మిల్లు పాయింట్‌కు చేరే వరకు పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యము, రైతు సేవ కేంద్రం నుంచి మిల్ పాయింట్‌కు చేరిన తరువాత అక్కడ మిల్లు యజమానులు రైతు సేవ కేంద్రంలో సాంకేతిక సిబ్బందితో ధృవీకరించిన నాణ్యత ప్రమాణాల పరంగా అభ్యంతరాలను లేవనెత్తకుండా ఒకే విధమైన పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

ఇందుకు కస్టోడియన్ అధికారిని నియమించడం జరుగుతుందని అన్నారు. క్లస్టర్ చేసిన ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీచే నియమించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఎదురైన, కంట్రోల్ రూమ్ నంబర్ 9491392717ను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి, తహశీల్దార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అమలవ్వని 'సూపర్ జీఎస్టీ' !

తెలుస్తోంది. నిత్యం గ్రామాల నుంచి పట్టణానికి పలు రకాల వస్తువులు, కిరాణా సరుకులను కొనుగోలుకు వచ్చిన వారికి సూపర్ జీఎస్టీ సంక్షేమ పథకంపై అవగాహన లేకపోవడం, షాపులలో తగ్గించిన రేట్ల వివరాల పట్టిక పెట్టకపోవడంతో ఆయా షాపుల నిర్వాహకులు ఎంత చెప్తే అంతే రేటుకు కొనుగోలు చేసి, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. దేశ అభివృద్ధి ఫలాలను ప్రతి పేదవానికి అందించేలా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల ఆశయం, అధికారుల నిర్లక్ష్యంతో అమలుకు నోచుకోకపోవడం బాధాకరమంటూ పలువురు పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా తగ్గిన జీఎస్టీ రేట్లపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించి, ప్రధాని మోదీ ఆశయం నెరవేరేలా గ్రామస్థాయిలో అధికారులు కృషి చేయాలని పట్టణ, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జీఎస్టీ రేట్ల వివరాల పట్టిక తప్పనిసరి: కమిషనర్ ధూళిపాళ్ల

ప్రభుత్వ నిబంధనలననుసరించి తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రకారం షాపుల నిర్వాహకులు అమ్మకాలు జరపాల్సిందేనని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని మాచర్ల మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు హెచ్చరించారు. గత 20 రోజుల నుంచి తగ్గిన జీఎస్టీ రేట్లకు విక్రయించాల్సిన షాపుల యజమానులు ఇంతవరకు కనీసం తగ్గిన జీఎస్టీ రేట్ల వివరాల బోర్డును కూడా పెట్టలేదంటూ ఫిర్యాదులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. జీఎస్టీపై ఇప్పటికే ఎన్నో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ పథకం నూరు శాతం అమలుకు కృషి చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సంచార వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - ఘంటసాల : ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కమ్యూనిటీ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సి లో "సంచార వ్యాధులపై అవగాహన కార్యక్రమం" సోమవారం నిర్వహించారు. డా. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రత, ఆరోగ్యకరమైన జీవన శైలిపై వివరించారు. సూపర్వైజర్లు, శివకృష్ణ, కె.పూర్ణచంద్రరావు , ఫార్మసీ ఆఫీసర్ చి.కృష్ణ , స్టాఫ్ నర్స్ వి.రాణి , ఎఎన్ఎమ్ జి.మర్తమ్మ , ఆశా వర్కర్ కె.సౌజన్య కుమారి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ వై.బిందియా కూడా విద్యార్థులకు ప్రేరణాత్మక మాటలు చెప్పి, ఆరోగ్య అవగాహన ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పిహెచ్‌సి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలోని వివిధ ప్రాథమిక జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు గురుకులం ఆశ్రమ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 2025 మెగా డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం మండల విద్యాశాఖ అధికారి (2) ఈఎల్‌సి కేశవరావు సమక్షంలో విధులలో చేరారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక పాఠశాలలో పదిమంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ఇద్దరు క్లస్టర్ పాఠశాల అసిస్టెంట్లు చేరారు అని మొత్తంగా మండలంలో 32 మంది నూతన ఉపాధ్యాయులుగా విధుల్లో చేరారు అని ఆయన తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు వచ్చిన ఉపాధ్యాయులకు మండల జడ్పీటిసి భూక్య గన్యా ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు భరోతుల నాయక్ నాయకులు అభినందనలు తెలిపారు.

బందర్ బొనాంజా షాపింగ్ ఫెస్టివల్

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందర్ బొనాంజా షాపింగ్ ఫెస్టివల్ ను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, తదితరులతో కలిసి షాపింగ్ ఫెస్టివల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత చరిత్రలో ఎన్నడూ లేని విదంగా ఎన్డీఏ ప్రభుత్వం వస్తు సేవల పన్ను తగ్గించి ప్రజలకు పన్నుల భారం నుండి ఉపసమనం కలిగించిందని, గతంలో కమర్షియల్, సెంట్రల్, స్టేట్, వ్యాట్ వంటి అనేక పన్నులుండేవని, 2014లో ఒకేదేశం ఒకే పన్ను విధానంతో నాడు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమలు చేసిందని, ఈ విధానంలో కేంద్రం పన్నులను రాష్ట్రాలకు వాటాలను పంపిణీ చేస్తుందని మంత్రి తెలిపారు. జీఎస్టీ విధానం వలన బ్లాక్ మార్కెట్ అరికట్టడం జరిగిందని, దేశ ఆదాయం పెరిగిందని, పెరిగిన ఆదాయాన్ని ప్రజలకు పంచాలనే ఉద్దేశ్యంతో జీఎస్టీ సంస్కరణలను చేపట్టి సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్స్ అందించామన్నారు. ఏపిఎస్ ఆర్టీ సీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకున ఎన్డీఏ ప్రభుత్వం పన్నులను తగ్గించి ప్రజల ఆదాయాన్ని పెంచిందన్నారు. కలెక్టర్ డీకె. బాలాజీ మాట్లాడుతూ ప్రతి సామాన్యుడు ఆనందకరమైన జీవితం గడపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి లబ్ది చేకూర్చిందని, వాటి ప్రయోజనాలు ప్రతి ఒక్కరికి అందాలనే లక్ష్యంతో నగరంలో బందర్ బొనాంజా షాపింగ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని వారం రోజులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ ప్రచార కమిటీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కల్పన, అడిషనల్ కమిషనర్ బాబురావు, జడ్పీసీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ డా. ఆనంద్ కుమార్, మెప్మా పిడి సాయిబాబు, తదితరులు సంస్థల ప్రతినిదులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KOPPARTHI VENKATA MAHALAKSHMI** (Old Name), D/o. **RAMAKRISHNA KOPPARTHI**, resident of Door.No: 33-10-2, Srinivasa Street, Seetharama Puram, Vijayawada (Urban), Krishna District, Andhra Pradesh - 520002. My name has been changed after surrender in **BRAHMA KUMARIS ORGANISATION** as **BRAHMA KUMARI MANI** (new name). Hereafter my name known as **BRAHMA KUMARI MANI**.

బంటుమిల్లి బస్టాండ్ వద్ద యాచకురాలు మృతి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- బంటుమిల్లి బస్టాండ్ వద్ద ఒక యాచకురాలు ఆదివారం రాత్రి మృతి చెందింది. సహో యాచకుడు రేపల్లె కి చెందిన కట్ట ఏసు ఇచ్చిన సమాచారం మేరకు మృతురాలి పేరు కట్ట అంజలి అని తన స్వగ్రామం నెల్లూరు అని, బిక్షాటన చేసుకుంటూ మచిలీపట్నంలో తనకు పరిచయం అయిందని ఇద్దరు కలిసి బిక్షాటన చేసుకుంటూ బంటుమిల్లి వచ్చామని తను గత కొన్ని రోజులుగా కామెర్ల వ్యాధితో ఇబ్బంది పడుతుందని ఏసు తెలిపారు. తనకు సంబంధించిన వారి పూర్తి వివరాలు లేనందున బంటుమిల్లి పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా బంటుమిల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆమె మృతదేహానికి అంత్యక్రియలు చేశారు.

టీచర్ పోస్టులకు ఇద్దరు కానిస్టేబుళ్లు ఎంపిక

అభినందించిన వన్‌టౌన్ సీఐ

విశాలాంధ్ర విజయవాడ (క్రైమ్): విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. 2018 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, నాగరాజు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికయ్యారు. నాగరాజు ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్‌గా, దుర్గాప్రసాద్ సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వారిని వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ అభినందించి సన్మానించారు. వారిద్దరూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాతో సన్మానించి కనకదుర్గమ్మ ప్రసాదాలు అందించారు. పలువురు పోలీసు సిబ్బంది కూడా దుర్గాప్రసాద్, నాగరాజులను అభినందించారు.

నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో వర్షం నీరు రోడ్లుపై లేకుండా విస్తృతంగా డీసిల్టింగ్ పనులు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ సోమవారం వన్‌టౌన్ నైజాం గేటు, పాత రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో పర్యటించారు. నగర రోడ్లపై వర్షం నీరు నిలువ లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ పర్యటనలో సీఎంవోహెచ్ డా.అర్జునరావు, ఈఈ శ్రీనివాస్, ఏఎంవోహెచ్ అన్నపూర్ణ, ఇంజనీర్ జాస్మిన్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తరాదు

సమస్యల పరిష్కారం పట్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతివారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 13 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానెర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఇంచార్జ్ పర్యవేక్షణ ఇంజనీర్లు శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో పొన్నగంటి రాజేశ్వరమ్మ మృతి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం దావాజీగూడెంలో పొనగంటి రాజేశ్వరమ్మ (94) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. పొన్నగంటి రాజేశ్వరమ్మ కుటుంబం సీపీఐ సానుభూతిపరులు ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు పొన్నగంటి సీతారామయ్య ప్రముఖ పారిశ్రామికవేత్త రెండవ కుమారుడు పొన్నగంటి వెంకటేశ్వరరావు (లేటు) (పివి) ఏఎస్ఎఫ్ఐలో పనిచేసి సీపీఐ గన్నవరం నియోజక వర్గ సమితిలో పనిచేసి సీపీఐ గన్నవరం బిల్డింగ్ సొసైటీ లో సెక్రటరీగా పనిచేశారు. బుద్దవరం గ్రామపంచాయతీకి సీపీఐ తరపున వార్డు నెంబర్‌గా పోటీ చేసి గెలిచి ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారు. బుద్దవరం దావాజీగూడెం లో సీపీఐ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. మూడవ కుమారుడు పొన్నగంటి శివ ఉన్నారు. ఆమె మృతదేహాన్ని సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, పట్టణ కార్యదర్శి నూతక్కి రామ్మోహన్‌రావు, సహాయ కార్యదర్శి చాగంటిపాటి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కట్టవరపు విజయరావు, మాజీ కార్యదర్శి కొండవీరాస్వామి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధన్‌రావు, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమార్ స్వామి, గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు మన్నే సుందర్‌రావు, రిటైర్డ్ డిఈ శ్రీనివాసరావు, గొంది రాజా గొంది నరేంద్ర బుద్ధవరం సర్పంచ్ బడుగు మరియదాసు, గన్నవరం మాజీ సర్పంచ్ నీలం బాలు, గొంది సాంబశివరావు తెలుగుదేశం నాయకులు సిహెచ్ కోటేశ్వరరావు గ్రామ పెద్దలు తెలుగుదేశం నాయకులు ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కాంతారావు నిరంతరం పోరాటం

విశాలాంధ్ర, మచిలీపట్నం : కార్య దీక్ష దక్షుడు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి ఎన్‌హెచ్ఎల్ కాంతారావు అని సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నాగేశ్వరమ్మ అధ్యక్షతన కాంతారావు సంతాప సభ జరగగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఓడుగు చైతన్యకుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంతారావు ఎస్టీయూ రాష్ట్ర టీచర్స్ యూనియన్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి, కృష్ణా జిల్లా కార్యదర్శి, అధ్యక్షులుగా పనిచేశారని ఆయన అన్నారు. కాంతారావు అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమైన విషయమని, మచిలీపట్నం చిట్టా బాలకృష్ణ శాస్త్రి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ జిల్లాలో ఉపాధ్యాయ సంఘం నిర్మాణంలో విశేషంగా కృషి చేసి ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు అవిశ్రాంతమైన కృషి చేసేవారని ఆయన కొనియాడారు. మచిలీపట్నం కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మానంలో ఆయన చేసిన విశేషమైన కృషి మరువలేనిదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి యర్రంశెట్టి ఈశ్వరరావు, తాటిపర్తి రామకృష్ణ, కర్నాటి అర్జున్ రావు, ఓడుగు నాగ పనింద్ర, మహిళా సమాఖ్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, ఓడుగు లక్ష్మీ దుర్గ, అనగాని లక్ష్మి, షేక్ జానమ్మ, గుండారపు భారతి, పి. దుర్గ, పుప్పాల శ్రీవిద్య, బండి రాఘవమ్మ తదితరులు పాల్గొని విప్లవ జోహార్లు అర్పించారు.

చల్లపల్లి గ్రామపంచాయతీ జాతీయస్థాయి అవార్డును సాధించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి గ్రామపంచాయతీ జాతీయస్థాయి అవార్డు ను సాధించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆకాంక్షించారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతలకు చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో చల్లపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2014లో చినుకులా ప్రారంభమైన స్వచ్ఛ ఉద్యమం వరదలా మారి ఉప్పెనలా మారటంతో స్వచ్ఛతా స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రత్యేకాధికారి పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, య ువనేత మండలి వెంకట్రామ్, డాక్టర్ పద్మావతి, ఏఎంసీ ఛైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, కార్పోరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో ఆనందకుమారి, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సొసైటీ ఛైర్మన్ యార్లగడ్డ లంకబాబు, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గం లోని కార్యదర్శులు, స్వచ్ఛ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డు సాధించిన సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, మన కోసం మనం ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్-డాక్టర్ పద్మావతి దం పతులు, చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బిఎస్. ఆర్.శ్రీనివాస్, అంగన్వాడీ కార్యకర్త షేక్ ముంతాజ్ బేగం, గ్రీన్ అంబాసిడర్ సొంతల జయలక్ష్మిలతోపాటు నాగాయలంక సర్పంచ్ కైతేపల్లి అం కాలు, కార్యదర్శి పవనకుమార్, మోపిదేవి గ్రీన్ అంబాసిడర్ కర్లపూడి కోటేశ్వరరావులను ఎమ్మెల్యే, డీపీవోలు ఘనంగా సన్మానించారు.

చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చండి



విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని గాంధీ నగర్ లో ఉన్న ఉదయపు నడక మిత్రమండలి భవనంలో సోమవారం ఉదయం తెల్లవారుఝామున ఏపి యోగసభ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న యోగా తరగతుల్లో జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కుండీలలో కుటుంబ సభ్యులు, యోగ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, మన ఆరోగ్యం మన చేతిలో ఉందని, ప్రతి ఒక్కరూ తమ పరిశరాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, మొక్కల వలన కాలుష్యం లేని ప్రాణవాయువు లభిస్తుందన్నారు. అలాగే వంటింటి వ్యర్థాలను ముఖ్యంగా కాయగూరలు, ఉల్లిపాయలు, పళ్ల వ్యర్థాల వంటి తడిచెత్తను రంధ్రాలు గల డబ్బాల్లో వేసి కొంచెం మట్టి కలిపి పుల్లటి మజ్జిగ లేదా బెల్లం నీరు చల్లితే నెల రోజుల్లో సేంద్రీయ ఎరువుగా మారుతుందని, దానిని పెరటి తోటల పెంపకంలో ఉపయోగించవచ్చన్నారు. మన ఇంటి అవసరాలకోసం పంటలను సేంద్రీయంగా పండించుకోవచ్చు ని, ఇంటి ప్రాంగణంలో లేదా స్థలం లేకపోతే మిద్దెపైన గాని పెరటి తోటలను పెంచుకోవచ్చన్నారు. రసాయనాలు వాడడం వలన వివిద రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని, సేంద్రీయ ఎరువులతో పండించి న పంటలను ఆహారంగా స్వీకరిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఇంట్లో చెత్తను బహిరంగంగా బయట పడవేయరాదని, తడి,పోడి చెత్తగా వేరుచేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు మద్దాల చింతయ్య, వడ్డే శ్రీనివాస్, యోగ సభ్యులు, సమాచార శాఖ డిడి ఎం. వెంకటేశ్వర ప్రసాద్, ఆర్ దుర్గాప్రసాద్, జగన్‌మోహన్ రావు, అశోక్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MAHABOOB SHARIFF SHAIK** (Old Name), S/o. **ABDUL KHUDDUS SHAIK,** Resident of Door No: 32-15-2\12, BNR Nagar, Chutugunta, Vijayawada, NTR District, Andhra Pradesh. I have changed my name as **MAHABOOB SHAREEF SHAIK** (New Name) S/o. **ABDUL KHUDDUS SHAIK.** Hereafter my name is known as **MAHABOOB SHAREEF SHAIK** (New Name) S/o. **ABDUL KHUDDUS SHAIK** for all purpose.

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

ఎన్.టి.ఆర్.జిల్లా గురునానక్ కాలనీ రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, తిమ్మరుసు వీధి, అఖిల అపార్ట్‌మెంట్, ప్లాట్ నెం.7, 2వ ఫ్లోర్, విజయవాడ-8 నివాసినైన కిలారు సాయిదీప్, తండ్రి కిలారు వెంకటేశ్వరరావు నాకు సంబంధించిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **U9668114**రు ది. **11-10-2025**నాడు మా ఇంటివద్ద నుండి దగ్గరలో ఉన్న గురునానక్ కాలనీలో ఫోటోస్టాట్ తీయించుటకు బైక్‌పై వెళ్ళుచుండగా ఎక్కడో పోయినది. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు గాని ఈ క్రింది సెల్: **7032698060**కు తెలుపగలరు.

రైతుబజారుని అందుబాటులోకి తీసుకురావాలి

విశాలాంధ్ర -విజయవాడ: నగరంలోని వించిపేట ప్రజలకు రైతుబజారుని అందుబాటులోకి తీసుకోని రావాలని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ 49, 50, 54, 55వ డివిజన్ల ఆధ్వర్యంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య అధ్యక్షతన 174 , 186 సచివాలయాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే పాతబస్తీ, వించిపేట ప్రాతంలోని ప్రజలకు అందుబాటులో సరసమైన ధరలకు తాజా కూరగాయలు అందించేందుకు 2017 లో అప్పటి నగరపాలక సంస్థ పాలక పక్షం వారు 40 లక్షల అంచనా వ్యయంతో జి౦1 ప్రాతిపదికన మొదటి అంతస్థు సేవ కేంద్రానికి, గ్రౌండ్ ఫ్లోర్ రైతు బజార్‌కు నిర్మాణానికి శంకుస్థాపన చేసి తరువాత కాలంలో నిర్మాణం కూడా పూర్తి చేశారు. మొదటి అంతస్థును గతంలోని సచివాలయాలు కేటాయించి అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ, రైతు బజార్‌కి ఉద్దేశించిన గ్రౌడ్ ఫ్లోర్లో మాత్రం రైతు బజారు షాపులకు లబ్దిదారులను ఎంపిక చేయడంలో అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ రైతు బజారులో షాపులు కేటాయింపులు జరుగక రైతుబజారు ప్రారంభం కాకపోవడం వల్ల ఈ ప్రాంగణం నిరుపయోగంగా మారి సాయంత్రం వేళా సాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిన పరిస్థితి నెలకొనడం అధికారుల అలసత్వానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మున్సిపల్ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ స్పందించి రైతు బజారు షాపులకు లబ్దిదారులను గుర్తించి వారికీ తక్షణమే షాపులను కేటాయించి రైతు బజారు ప్రారంభానికి అధికారులను చర్యలు చేపట్టాలని లేని పక్షంలో వివిధ స్థాయిలలో అధికారుపై ఒత్తిడి చేసేందుకు కావాల్సిన ఉద్యమానికి స్థానిక నాయకత్వానికి సీపీఐ విజయవాడ నగర సమితి తరపున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ నాయకులు బోర రామకృష్ణ, మోకా దుర్గారావు (చిన్న), మురుగేషన్ రాము, పగిదికత్తుల రాము, నగర యువజన సమాఖ్య నాయకులు కంచర్ల భార్గవ్, లంకె సాయి, స్థానిక డివిజన్ పార్టీ నాయకులు పిట్టా అప్పారావు, తుపాకుల ప్రతాప్, ఎస్.కె. సిద్ధిక్, బల్ల నరసింహరాజు, తిప్పాబాతుల వెంకటేశ్వరరావు, కాగితాల కనకారావు, టంగుటూరు ధనుంజయ్ కుమార్, బోర రాము, సయ్యద్ హాకిమ్, పీత శేఖర్, పెద్దాడ బాబ్జి, పోరంకి చిన్నారావు, తుపాకుల నాగేశ్వంరావు, చెక్క తిలక్ వర్మ, వడుగు శ్రీనివాసరావు, మితింటి గోపికృష్ణ, కర్రీ రాజేష్, బాబురావు, డేవిడ్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రణాళికలు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : అత్యంత ప్రమాదకరమైన సముద్రపు చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు సంక్షేమం కోసం పక్కా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు బందరు ఎంపీ బాలసౌరి అన్నారు. సోమవారం మండలంలో పలు గ్రామాలలో జనసేన పార్టీ జెండాదిమ్మలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లంలో యువకులు పెద్ద ఎత్తున జనసేన పార్టీలో చేరారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బాలసౌరి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలు నిరంతరం ప్రమాదాలలోనే కొనసాగుతాయని అన్నారు. సముద్రంతో పోరాడి మత్స్యకారులు జీవనం సాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, మచిలీపట్నం ఏఎంసీ చైర్మన్ బండి రామకృష్ణ, పెదన పార్టీ కన్వీనర్ మంచగల సురేష్, డైరెక్టర్ తిరుమల శెట్టి చంద్రమౌళి, ఒడుగు ప్రభాస్ రాజు, తిరుమాని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'నాట్య సుధామయి'గా మట్టపల్లి పార్ధిని

విశాలాంధ్ర-విజయవాడ: భారతీయ నృత్యం ఔన్నత్యం అంశంపై విశేష ప్రతిభ కనబరిచి "నాట్య సుధామయి"గా బిరుదును మట్టపల్లి పార్ధిని సొంతం చేసుకుందని ప్రిన్సిపల్ సుధా తెలిపారు. సోమవారం గుణదలలోని రవీంద్ర భారతి నెక్స్ట్ జెన్ స్కూల్ లో జరిగిన విలేకరి సమావేశంలో ప్రిన్సిపల్ సుధా మాట్లాడుతూ మా పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న మట్టపల్లి పార్ధిని గత నెల 16, 17, 18 తేదీలలో తిరుపతిలో జరిగిన విశ్వభారతి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ నుంచి భారతీయ నృత్యం ఔన్నత్యం అనే అంశాన్ని అద్భుతంగా ప్రదర్శించి నాట్య సుధామయి బిరుదు ఆదివారం తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. చైర్మన్ వంశీ, డైరెక్టర్ శాంతి, సీఈఓ గౌతమి స్కూల్ యాజమాన్యం పార్ధినిని అభినందించారు.

'సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్' : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం కంచికచర్ల పట్టణంలోని చెవిటికల్లు సెంటర్‌లో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిరు వ్యాపారస్తులు, వ్యాపార సంస్థల అధినేతలతో సమావేశమై, సూపర్ జిఎస్టి ద్వారా సామాన్య ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాలను మరియు వ్యాపార రంగంలో సాధిస్తున్న వృద్ధిని వివరంగా తెలియజేశారు. కూటమి నేతలతో కలిసి కరపత్రాలను పంపిణీ చేసి, వ్యాపారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, 'సూపర్ జిఎస్టి వ్యవస్థ ద్వారా చిన్న చిన్న వ్యాపారులు కూడా ఎంతో లాభపడుతున్నారు. ఇది సామాన్యులకు సైతం సేవింగ్స్‌ను అందిస్తూ, వ్యాపారాన్ని వేగవంతంగా వృద్ధి చేస్తోంది. ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చాలని కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, కూటమి నేతలు, మహిళలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట : ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికై, విస్సన్నపేట మండలానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులకు సోమవారం అధికారులు నియామకపత్రాలు ఇచ్చారు. ఎంపీడీవో సిహెచ్.చిన్నరాట్నాలు మాట్లాడుతూ, మండలానికి 14మంది సెకండరీ గ్రేడ్ టీచర్లుగా, మరో ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లుగా నియమితులైనట్లు తెలిపారు. ఎంపీడీవో చిన్నరాట్నాలు, ఎమ్మీవోలు శంకర్రావు, సుధాకర్ నియామకపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర -పమిడిముక్కల: జెడ్పీ ఉన్నత పాఠశాల అగినపర్రులో పి4 పథకం ద్వారా 23 విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార రాజా ఆదేశాల మేరకు స్థానికులు బొబ్బా ప్రకాష్ ద్వారా సదరు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిగురుపాటి కృష్ణారావు వై.లాలు కృష్ణ వి.వెంకటేశ్వర రావు వి.సుబ్రమణ్యం ఎన్.వెంకటేశ్వర రావు పిఇటి వి.వెంకటేశ్వర రావు లు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-పమిడిముక్కల: పమిడిముక్కల శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుని గా కబళబవాయి ఖాదర్ బాబ ఎన్నికైనట్లు గ్రంధలయ నిర్వాహకులు సాలార్ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల కార్యదర్శి ఉత్తర్వులు మేరకు కమిటీ ని ఎన్నుకోవడం జరిగిందని సభ్యులు గా చొక్కా మోహన్ రావు బంద్రపల్లి ఏబు కోనేటి సుబ్రహ్మణ్యం రాచూరి శారద అద్దేపల్లి ఏసోబు కంచర్ల దుర్గారావు కాగిత ముత్యాలు పఠాన్ రహిం ఖాన్ కోగంటి సుబ్రహ్మణ్యం లు ఎన్నికైనట్లు షరీఫ్ తెలిపారు.

14 మంది నూతన ఉపాధ్యాయులు చేరిక

విశాలాంధ్ర-పెడన : మెగా డీఎస్సీ రిక్రూట్మెంట్ లో భాగంగా సోమవారం పెడన లో 14 మంది నూతన ఉపాధ్యాయులు చేరినట్లు ఎంఈఓ - 1 ఎన్.సలోమి తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులు ఈ నెల 9, 10 తేదీలలో జరిగిన కౌన్సిలింగ్‌లో వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాలని జిల్లా విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు పెడనలోని జిల్లా పరిషత్ హైస్కూల్ చెన్నూరులో 6 గురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెనుమల్లి లో 4 గురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందమూరు లో 4 గురు జాయిన్ అయినట్లు తెలిపారు.

ఎఫ్‌ఏ-2 పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రభుత్వ, ప్రైవేట్.పాఠశాలల్లో ఈనెల 15వ తారీకు వరకు నాలుగురోజుల పాటు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకుజరిగేఎఫ్ ఏ -2 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమైనాయి. దీనిలో భాగంగానేమొవ్వ మండలంలోని 9 జిల్లా పరిషత్ హై స్కూల్స్, ఒక ఎయిడెడ్ హై స్కూలు, 46 ఎంపి ఎలిమెంటరీ పాఠశాలలు, రెండు ఎంపీ యూపీ పాఠశాలలు, 12 ప్రభుత్వంగుర్తింపు పొందిన పాఠశాలలు కలిపి కే శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

నిన్నవిద్యార్థి... నేడు ఉపాధ్యాయినీ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి జెడ్పీ హైస్కూల్ లెక్కల ఉపాధ్యాయినిగా వినుకొండ కనకదుర్గ సోమవారం హెచ్ఎం అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరికి జాయినింగ్ రిపోర్ట్ అందజేసి విధులకు హాజరైనారు. డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన ఆమె కూచిపూడి గ్రామంలోని అదేపాఠశాలవిద్యార్థినికాగా నేడు అదే పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టారు. కూచిపూడి గ్రామానికి చెందిన కనకదుర్గఇదే పాఠశాలలో 1997-1998 విద్యా సంవత్సరం నుంచి 2003-2004 విద్యా సంవత్సరం వరకు నాల్గవతరగతినుంచి పదవ తరగతి వరకు విద్యార్థిగా కొనసాగి అదే పాఠశాలకు గురువు స్థానంలో చేశారు.

ఉపాధ్యాయులకు స్వాగతం పలికిన పాఠశాలలు

విశాలాంధ్ర-కూచిపూడి : మెగాడీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో సోమవారం నుంచి కొలువులకు తొలిసారిగా హాజరైనారు. ఈసారిఉపాధ్యాయ పోస్టులతోపాటు క్లస్టర్ ఉపాధ్యాయులను కూడా నియమించడంతో ఆయాక్లస్టర్లలోఉపాధ్యాయులు సెలవుపెడితే వీరిని పంపేందుకు వీలుగా ప్రభుత్వం ఈ పోస్టులను తొలిసారిగా మంజూరు చేసినట్లు ఉప ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మొవ్వ పిఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్లో ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్స్ తో కలిపి ఐదుగురు టీచర్స్ జాయిన్ అయినట్లు హెచ్ఎం నిమ్మగడ్డ ఉమాశ్రీతెలిపారు. కూచిపూడి శ్రీసిద్దేంద్రజిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో డీఎస్సీ ద్వారా లెక్కల టీచర్ పోస్ట్ భర్తీ చేయగా సంస్కృతం మాస్టారు పోస్ట్ ఖాళీగానే ఉందని హెచ్ఎం ఏ.ఏ. భువనేశ్వరి తెలిపారు.

'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్'

విశాలాంధ్ర-కూచిపూడి : సూపర్ జీ.ఎస్టీ.తో సామాన్యులు రోజు వినియోగించుకొనే వస్తువులకు పెద్దపీట వేయడంతో ఆహార పదార్థాలపై పన్ను భారం తగ్గిందంటూ కూచిపూడి గ్రామపంచాయతీ మరియు సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. సోమవారం దుకాణదారులకు సూచనలు ఇచ్చారు. పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అప్పికట్ల రామ్ ఫణీంద్ర, సచివాలయ సిబ్బంది పి.ఉమామహేశ్వరరావు(వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్), ఏ అరుణ (డిజిటల్ అసిస్టెంట్), కే యామిని (మహిళా పోలీస్), ప్రదీప్ (ఇంజనీరింగ్ అసిస్టెంట్), పాల్గొన్నారు

జీవన ఎరువుల వారోత్సవాలపై అవగాహన

విశాలాంధ్ర - ఘంటసాల : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ప్రాంగణంలో కేవీకే శాస్త్రవేత్తల బృందం డా. యం.వెంకట లక్ష్మీ, డా.కే.రేవతి జీవన ఎరువుల అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. జీవన ఎరువులు వినియోగించు విధానాన్నీ నైపుణ్యత ప్రదర్శన ద్వారా సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. సస్యపోక్షణ శాస్త్రవేత్త డా. వెంకట లక్ష్మీ మాట్లాడారు.

పోషక తోట ప్రాముఖ్యత పై అవగాహన

విశాలాంధ్ర-ఘంటసాల : ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం గుంటూరు నందలి కమ్యూనిటీ సైన్స్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా అంగన్ వాడీ పాఠశాలలో సోమవారం "న్యూట్రీ గార్డెన్" (పోషక తోట) ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ వై. బిందియా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. అంగన్‌వాడీ టీచర్ కె. కనకదుర్గా పాల్గొని పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తోటలో వివిధ రకాల కూరగాయలు ఆకుకూరలు నాటడం ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం పట్ల అవగాహన కల్పించారు.

సబ్ కలెక్టర్ గ్రీవెన్స్‌కు 8 ఫిర్యాదులు

విశాలాంధ్ర - తెనాలి : తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ఎనిమిది అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. రెవెన్యూ విభాగానికి 2, పోలీసు 3, పంచాయితీ రాజ్ విభాగం 1, మున్సిపాలిటీకి 2 అర్జీలు రాగా వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు.

15 వరకే దీపావళి స్టాల్ లైసెన్సులకు గడువు

-సబ్ కలెక్టర్ సంజనా సింహ

విశాలాంధ్ర - తెనాలి : దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు లైసెన్సు గడువు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే ఉందని తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు లాటరీ పద్ధతిలో ఎంపిక చేసే స్టాల్స్ కోసం తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేయబడతాయన్నారు. అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెనాలిలో వైసీపీ నిరసన

విశాలాంధ్ర - తెనాలి : రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం అరికట్టాలంటూ తెనాలిలో వైఎస్సార్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు శివాజీచౌక్ వద్ద నుండి పార్టీ నాయకులతో కలిసి ప్రదర్శనగా బయలుదేరి కొత్తపేటలోని ఎక్సైజ్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా అన్నాబత్తుని శివ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మద్యం దోపిడీ కేసును సిబిఐకు అప్పగించాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో వికాస్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణానికి చెందిన సాయి వికాస్ విద్యార్థి విద్యా ర్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నరసరావుపేటలో నిర్వహించిన చెస్, బ్యాడ్మింటన్ లలో ప్రతిభ చాటారు. అండర్ 14 విభాగంలో కొర్నెపాటి లత, నరిసెట్టి కుషాల్ లు డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందారు. అండర్ 17 విభాగంలో కొర్నెపాటి లేఖన డివిజన్ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందింది. బ్యాడ్మిం టన్ లో అండర్ 14 బాలికల విభాగంలో పఠాన్ నేహ ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈ విద్యార్థులందరూ డివిజన్ స్థాయి నుండి జిల్లా స్థాయికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నరిసెట్టి వీరస్వామి, ప్రిన్సిపల్ శ్రీకాంత్, ఏవో సుభాని, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఈ విద్యార్థులను అభినందించారు.

నకిలీ మద్యంపై వైసీపీ పోరు బాట

విశాలాంధ్ర-చిలకలూరి పేట: కల్తీ మద్యం కి వ్యతిరేకంగా మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో చిలకలూరి పేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించి, స్థానిక ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నారా వారి సారా వద్దు, నకిలీ మద్యం తో ప్రజల ప్రాణాలు తీయవద్దు అంటూ నినాదాలతో కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీ, సరఫరాపై ప్రభు త్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యా ప్తంగా కల్తీ మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరారు. నకిలీ, కల్తీ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తించి, వారి కుటుంబాలను ఆదుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

గిరిజనలకిచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం

విశాలాంధ్ర - చిలకలూరిపేట : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గిరిజన ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. శ్రీనునాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అక్రవర్ణాల ఆధిపత్యం ఎక్కువగా ఉండటం వలన బడుగు, బలహీన వర్గాల ప్రజలు చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్ని కల్లో వారిచేత ఓట్లు వేయించుకొని వారికి కావల్సిన చిన్న చితికా పనులు చేయడం లో విఫలమయ్యారన్నారు. ఇదే ధోరణి రానున్న రోజుల్లో కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మూడు మండలాల్లో, పట్టణంలో గిరిజన సమాఖ్యను బలోపేతం చేయడం కోసం కృషి చేయాలన్నారు. దీపావళి పండుగ తర్వాత నూతన కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోవాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా మనకు రావాల్సిన హక్కు ల కోసం పోరా టాలు చేయవలసిన ఆవశ్యకత ఎం తైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరు బాబురావుతోపాటు ఆయా మండ లాలకు చెందిన గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి అవసరాలు తీర్చాల్సిన కొన్ని ఆర్వో వాటర్ ప్లాంట్లు ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నాయని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వాటర్ ప్లాంట్ల పైన తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ బి. రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఎస్‌పీఎఫ్ క్రీడా పోటీలు

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఏ.పి.ఎస్.పి.ఎఫ్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 14 నుండి 23వ తేదీ వరకు జరగనున్నాయని ఏ.పి.ఎస్.పి.ఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, డిఎస్పీ ఆర్.వి.ఎస్.ఎన్. మల్లికార్జున రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 23న జరగనున్న 34వ ఏ.పి.ఎస్.పి.ఎఫ్ వ్యవస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈ నెల14వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలో జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న యూనిట్లలో పని చేస్తున్న క్రీడాకారులు, అథ్లెట్లు, వాలీ బాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, 5 కి.మీ పరుగు మొదలైన ఈవెంట్లలో పాల్గొంటారని చెప్పారు. ఈ వేడుకలకు రాష్ట్ర హెం మంత్రి, ఇతర ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలు : డీఆర్వో

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: జిల్లాలో ప్రజలకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయిలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆషారాణి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 51 మంది ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-దుర్గి : మండలానికి కేటాయించిన 51 మంది నూతన ఎస్జీటీ ఉపాధ్యాయులు సోమవారం విధుల్లోకి చేరినట్లు ఎంఈఓ-1 షేక్ ఖాశిం, ఎంఈఓ-2 బెంజిమెన్ తెలిపారు. వారిలో మండల పరిషత్ పాఠశాలలకు 24 మంది, జిల్లా పరిషత్ పాఠశాలలకు 27 మంది నూతన ఉపాధ్యాయులు చేరినట్లు వారు తెలిపారు. మండలానికి ఎంపికైన అభ్యర్థులు మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చి ఎంఈఓలను కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఫలితాలు విడుదల చేసి, ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలలను కేటాయిస్తూ నియామక పత్రాలను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. 2025 మెగా డీఎస్సీ ద్వారా ఎంపికయి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని చేపడుతున్న నూతన ఉపాధ్యాయులకుఎస్టీయూమండలశాఖ స్వాగతంపలికి అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్ పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న అక్రమ మద్యం

విశాలాంధ్ర - వినుకొండ : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మద్యం, నకిలీ మద్యం ఏరులై పారుతుందని, దొంగే, దొంగ.. దొంగ అన్నట్లు కూటమి పెద్దలు వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘాటుగా విమర్శించారు. నకిలీ మద్యం నియంత్రించి మను షుల ప్రాణాలు కాపాడాలని కోరుతూ వైసిపి ఆధ్వ ర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. వైసిపి కార్యాలయం నుండి బయలుదేరిన నిరసన ర్యాలీ లాయర్స్ స్ట్రీట్ నుండి నరసరావుపేట రోడ్డు మీదుగా ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుంది. అయితే అప్పటికే ఎక్సైజ్ కార్యాలయం ఎదుట పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు భారీగా మోహరించారు. బ్రహ్మనాయుడు కార్యకర్తలు పై అంతస్తులో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలోకి ఎక్కబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వినతి పత్రాన్ని ఎక్సైజ్ సీఐ బి. శ్రీనివాసరావుకు అందజేసి, అక్రమ, నకిలీ మద్యాన్ని అరి కట్టి విచ్చలవిడిగా పెరిగిపోతున్న మద్యం బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరారు. అనం తరం బొల్లా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని, అక్రమ మద్యం, నకిలీ మద్యం ఏరులై పారు తున్న కూటమి పెద్దలు నోరు మెదపడం లేదని ఆయన అన్నారు. 20 నెలల కూటమి పాలన అంతా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తిట్టడమే సరి పోయిందని, అక్రమ సంపాదనలో ఎమ్మెల్యే, ఎంపీ లకు ముడుపులు అందుతున్న కారణంగా వారు కూడా నోరు ఎత్తలం లేదని బొల్లా విమర్శించారు. ఇక గ్రామాలలో మద్యం బెల్ట్ షాపులు నియోజకవర్గం మొత్తంలో 1000 షాపుల వరకు పెరిగిపోయాయి అన్నారు. ఇక నేరుగా రైతు భరోసా కేంద్రాల సమీపంలోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, సమాజానికి ఏం చెప్పనున్నారని బొల్లా ప్రశ్నించారు. ఇక ప్రభుత్వ గోడౌన్లలో మద్యం నిల్వలు ఉంచుతు న్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో కూటమి పెద్దలు పెత్తనం చేస్తుండగా, అధికారులు మాత్రం నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారన్నారు. అలాగే పలు గ్రామాలలో రేషన్ కు బదులు మద్యం సీసాలు ఇవ్వ డం దారుణంగా ఉందన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పక్క ఉన్న వారంతా, దిగజారుడు పనులు చేస్తూ అధికారులపై పెత్తనం చేస్తున్నారని, జీవికి చాప కింద నీరులా వ్యవహరిస్తున్నారని, దాన్ని జీవి త్వరలో తెలుసుకుంటారన్నారు. వినుకొండ మునిసి పల్ కమిషనర్, టిడిపికి తొత్తుగా వ్యవహరిస్తూ పారదర్శకాన్ని మర్చిపోయారని. రానున్న రోజుల్లో అందరి సంగతి తేలుస్తాం అని బొల్లా హెచ్చరించారు. పల్నాడు జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి, న్యాయవాది ఎం.ఎన్. ప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి పగడాల వెంకటరామిరెడ్డి, వైసిపి అధికార ప్రతినిధి, వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా అక్రమమద్యం, కల్తీ మద్యం సరఫరా అవుతున్నదని, కూటమి పెద్దలకు మూడు పూలు - ఆరు కాయలు అన్న విధంగా అక్రమ సంపాదన చేరుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై కొంత అసంతృప్తి చోటు చేసుకుంటున్నదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మద్యం, నకిలీ మద్యంపై 5 వేల కోట్లు రూపాయిడి జరిగిందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐదు మండలాల వైసిపి కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జీజీహెచ్‌ను సందర్శించిన ప్రపంచ బ్యాంక్ బృంద సభ్యులు

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : ప్రపంచ బ్యాంక్ బృంద సభ్యులైన డాక్టర్ మెహిర్, డాక్టర్ ఎడ్వర్డ్, డాక్టర్ గణేష్ మణిము తథూ, వాసుబాబు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జీజీమెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అత్యవసర విభాగం పని తీరు..అలాగే అత్యధికంగా వస్తున్న పేషంట్ల రద్దీని తగ్గించుటకు తీసుకుంటున్న చర్యలు గురించి నవజాత శిశువుల మరణాల రేటుపై..అదేవిధంగా ఆసుపత్రి నందు ఇన్ఫెక్షన్ కంట్రోల్, తీసుకుంటున్న చర్యలుపై వచ్చిన బృందానికి వివరించారు. ప్రపంచ బ్యాంక్ బృంద సభ్యులు ముందు ముందు మరింత లోతైన అధ్యయనం చేసి వారి నుంచి మరిన్ని ప్రతిపాదనలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎన్ఐసీయూ వైద్యులు, ఇన్ఫెక్షన్ కంట్రోల్ బృందం, ఎమర్జెన్సీ వైద్య విభాగం నుంచి డాక్టర్ రాధికారాణి, పీడియాట్రిక్ వైద్యులు, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: ఈ నెల 18వ తేదీన స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో జరగనున్న ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభలను విజయవంతం చేయాలని ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్య దర్శి వి.వి.కే.సురేష్ పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక అరండల్ పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల లోని ఎల్ఐసీ కార్యాల యాల్లో పనిచేసే ఉద్యోగుల సుమారు 300 మంది ప్రతినిధులుగాను, పరిశీలకులుగాను మహాసభలకు హాజరవుతారు. సౌత్ సెంట్రల్ జీన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్ మహాసభలను ప్రారంభిస్తారని తెలిపారు. శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకరబాబు తదితరులు ఈ మహాసభలలో పాల్గొంటారని తెలిపారు. భీమారంగంలో విదేశీ ఈక్విటీ పెంపుదల, ఉద్యోగాల రిక్రూట్ మెంట్, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు, ఉద్యోగుల పెండింగ్ సమస్యలు మొదలగు వాటిని సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనిట్స్ నాయకులు డి.సైదులు, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, వి.ఆర్.గోపాల కృష్ణ, మహిళా ఉద్యోగుల డివిజన్ కన్వీనర్ సి.హెచ్. మధుబాల, పి.ఆర్.రాజశేఖర్, ఆర్. విజయ రాఘవ, ఐ.వెంకట్రావు, జే.రాజేంద్ర ప్రసాద్, డి.ఉమామహేశ్వర రావు, ఏ.ఉషాబాల, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నగర శివారు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : మేయర్

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: నగర శివారు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక వీబీపీ రోడ్డు నందు నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే కావేరి నగర్ నందు మురుగు నీరు పారుదల సరిగా లేదని ప్రజల నుండి అందిన పిర్యాదు మేరకు సదరు ప్రాంతంలో పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి తాగు నీరు, పారిశుధ్యంపై ఎటువంటి పిర్యాదులు రాకుండా చర్యలు తీసుకో వాలని, పిర్యాదులు ఏమైనా వచ్చినా వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశం చారు. పర్యటనలో కార్పోరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, ఇంచార్జ్ యస్.ఈ సుందర్రామిరెడ్డి, ఈ.ఈ కోటేశ్వర రావు, ఏ.ఈ ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

16 నుంచి జీఎస్టీ 2.0పై జిల్లా ఉత్సవ్ : జేసీ

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : జీఎస్టీ 2.0 పై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్, జీఎస్టీ నోడల్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఏసీ కళాశాల ప్రాంగణంలో ఉత్సవ్ జరుగుతుందని అన్నారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ ద్వారా అమ్మకాలు జరుగుతాయన్నారు. వీటిలో హోమ్ అప్లయన్స్, క్రీడా పరికరాలు, మెట్రాస్, జిమ్ ఫిట్నెస్, సోలార్, బుక్స్ స్టేషనరీ, కెమిస్ట్ (డ్రగ్గిస్ట్, గృహోపకర ణాలు, అన్ని రకాల ఎల్రక్ట్రానిక్స్ వస్తువులు తదితర వాటికి సంబంధించిన దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

అనధికార లాటరీ నిర్వాహకులపై టాస్క్ ఫోర్స్ దాడులు

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్ పర్యవేక్షణలో సోమవారం సుమారు ఉదయం 11 గంటల సమయంలో లాలాపేట పోలీస్ పరిధిలోని ఏటుకూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఆటోలో కూర్చుని సింగిల్ నంబర్ లాటరీ ఆడుతున్న నలుగురు వ్యక్తులను లాలాపేట పోలీస్ సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి లాటరీ టికెట్ల పుస్తకాలు, 3 సెల్ ఫోన్లు, రూ.4,700లు నగదు సీజ్ చేసి, తదుపరి చర్యలు నిమిత్తం లాలాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. చట్ట వ్యతిరేకంగా బెట్టింగులు, అనధికార లాటరీలు, ఇతర పందేలను నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

నూతన ఉపాధ్యాయులకు ఎస్టీయూ అభినందనలు

విశాలాంధ్ర - దుర్గి : మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు దుర్గి మండల ఎస్టీయూ శాఖ వారికి మండల వనరుల కేంద్రంలో అభినందనలు తెలియజేస్తూ వారికి ఉపాధ్యాయ వృత్తి ప్రవేశానికి అవసరమైన డాక్యుమెంట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పట్టుదల దీక్షతో అహర్నిశలు శ్రమించి ఉపాధ్యాయ వృత్తిలోనికి అడుగుపెడుతున్న ఉపాధ్యాయులందరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని, ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ముందుంటుందని దుర్గి మండలం ప్రధాన కార్యదర్శి కటకం అపర్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గి మండలంలో దాదాపు 60 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరుటకు నూతన డీఎస్సీ పకడ్బందీగా అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్టీయూ శాఖ కృతజ్ఞతలు తెలియజేశారు. అలానే దుర్గిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండవ కేటగిరి అయినందున ఒక్క సోషల్ పోస్ట్ కూడా డీఎస్సీలో కేటాయించకపోవడంతో విద్యాభివృద్ధికి ఆటకం ఏర్పడుతుందని కావున పలనాడు ప్రాంతంలోని దుర్గి, మాచర్ల మండలాలలో రెండవ కేటగిరీలోని ఉన్నత పాఠశాలలకు కూడా వెంటనే సబ్జెక్టు ఉపాధ్యాయులను కేటా యించి పదవ తరగతి విద్యార్థులకు విద్యాబోధన కుంటుపడకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జీసీహెచ్ అనంతరామయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎర్రం ఏడుకొండలు, మండల ప్రధాన కార్యదర్శి కనకం అపర్ణ, మండల ఆర్థిక కార్యదర్శి భూసాని శ్రీనివాస రావు, పలువురు నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు వృత్తిలో ప్రవేశానికి అవసరమగు డాక్యుమెంట్స్ ఫైలును ప్రతిఒక్కరికి అందజేసి అభినందనలు తెలిపారు.

సత్తాచాటిన సెయింట్ జోసఫ్ విద్యార్థులు

విశాలాంధ్ర - పెద కాకాని : మండల పరిధిలోని సెయింట్ జోసెఫ్ సీబీఎస్సీ విద్యార్థులు అమరావతి రూరల్ స్కేటింగ్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో గుం టూరు జిల్లా 20 రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళగిరిలో నిర్వహించగా పాఠశాల విద్యార్థులు బి. శ్యాం ప్రవీణ్ (8వ తరగతి), కుర్ర చరణ్జిత్ (7వ తరగతి), రోని వర్ధన్(4వ తరగతి)లు వివిధ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకొని సెయింట్ జోసెఫ్ పాఠశాల సత్తాను చాటారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు సిస్టర్ సంధ్యారాణి పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట : ఎమ్మెల్యే గళ్లా

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : కేంద్రం ఇటీవల తీసుకున్న జీఎస్టీ 2.0 పన్ను సంస్కరణలు, సామాన్య ప్రజల జీవన స్థాయిని మెరుగుపరచే దిశగా తీసుకున్న కీలక నిర్ణయాలు, పన్ను రేట్ల తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గి, పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభిస్తోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అక్కడ ప్రదర్శించిన వస్తువుల ధరల తగ్గింపును ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇప్పటి వరకు జీఎస్టీ నాలుగు స్లాబ్‌లలో(5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం) ఉండేది. తాజా గా కేంద్ర ప్రభుత్వం దీన్ని రెండు స్లాబ్‌లకు పరిమితం చేసింది. ప్రజలకు నేరుగా లాభం చేకూరేలా 99 శాతం వస్తువులను 5 శాతం స్లాబ్‌లోకి చేర్చారని చెప్పారు. అదనంగా, హెల్త్ ఇన్సూరెన్స్‌పై పన్నును పూర్తిగా తొలగిం చడం ద్వారా సామాన్యులకు వైద్య ఖర్చులు తగ్గాయ న్నారు. ప్రజలు పాత ధరలు కాకుండా కొత్త జీఎస్టీ తగ్గింపు రేట్ల ప్రకారం వస్తువులను కొను గోలు చేస్తున్నారో లేదో పరిశీలించుకోవాల న్నారు. అవగాహన కలిగిన వినియోగదారుడే బలమైన ఆర్థిక వ్యవస్థకు మూలాధారమని ఆమె పేర్కొన్నారు.

ఇరికేపల్లిలో వార్డు ఎస్సీలకు కేటాయించాలి

విశాలాంధ్ర - దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లిలో ఉన్న రెండు వార్డుల్లో ఓట్ల దామాషా ప్రకారం ఒకటి ఎస్సీలకు కేటాయించాలని పల్నాడు బల హీనవర్గాల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనరు వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. 18, 19 వార్డులు జనరల్ కోటాలో ఉన్నప్పటికీ తాజాగా అందులో ఓ వార్డు నుంచి 1000 మంది ఎస్సీ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. దాంతో ఆ వార్డును ఎస్సీలకు రిజర్వు చేసి వారికి ఈసారి జరిగే ఎన్నికల నాటికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని కోరారు. వారిలో వేదిక గురజాల నియోజకవర్గ కార్యదర్శి గద్దల వేదమణి, కౌన్సిలర్ షేక్ షరీఫ్, గరికపాటి వెంకట కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయండి: ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర - మాచర్ల : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. మెగా డీఎస్సీతో ఉద్యోగాలు సాధించిన 98 మంది నూతన ఉపాధ్యాయులకు సోమవారం ఆయన అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

బదిలీలను కోరుకున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర - రాజుపాలెం : ట్రాన్స్‌ఫర్ కోరుకున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో కోరారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులు వస్తారు. మమ్మల్ని రిలీవ్ చేస్తారని ఆశపడి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు నిరాశ ఎదురైందని ఆయన అన్నారు.

కల్తీ మద్యంపై వైసీపీ నిరసనలు

విశాలాంధ్ర – మాచర్ల : కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం అమ్మకాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్ జలీల్, పోలా శ్రీనివాసరావుల ఆధ్వర్యం లో నిరసన తెలిపి ప్రొహిబిషన్ సిఐ వెంకట రమణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలనలో కల్తీ మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నా యన్నారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో తాము మాచర్లలో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కౌన్సిలర్లు గురవయ్య, సంతోష్, సుందరరావు, సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బూడిద శ్రీనివాసరావు, అనంత రామయ్య, శివలింగం, ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, మల్లెల శీను, గొబ్బూరి ఆదయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసీపీ నిరసన

విశాలాంధ్ర–గురజాల : రాష్ట్రంలో కుటీర పరిశ్రమలాగా నారావారి కల్తీ మద్యంతో ప్రజలు బలవుతున్నారని, నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆదేశాలతో సోమవారం గురజాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాణ్యమైన మద్యం అంటే నకిలీ మద్యమా? ఎన్ బ్రాండ్ కల్తీ మద్యంతో జనం బలి, పర్మిట్ రూమును రద్దు చేయాలంటూ ప్లకార్డ్స్ చేత బూనారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గురజాల, దాచేపల్లికు చెందిన వైసీపీ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు, వేముల చలమయ్య, సిద్దాడపు గాంధీ యాదవ్, అమరా రెడ్డి, కె.రవి శంకర్రావు, కర్రా చిన కోటేశ్వరరావు, గిరిబాబు, ఎం.ప్రకాష్ రెడ్డి, కోట కృష్ణ, కందుల జాన్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర–పెదకూరపాడు : ఎక్సైజ్ అండ్ ప్రొబిషన్ కార్యాలయం ఎదుట నకిలీ మద్యం సరఫరాపై నియోజకవర్గ వైసీపీ నేతలు నిరసన తెలి పారు. ఇన్‌స్పెక్టర్ తులసికి వినతిపత్రం అందించారు. అనంతరం వైసీపీ రాష్ట్ర నేత ఈదా సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ లిక్కర్ తాగి ఇప్పటికే ఎంతోమంది అమాయకులు పేదలు చనిపోయారన్నారు. ఇళ్లల్లో మహిళల తాళిబొట్లు తెగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జయమ్మ, కంచర్ల అచ్యుతరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర–తాడికొండ : కల్తీ మద్యం దోషులను కఠినంగా శిక్షించాలని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా డైమండ్ బాబు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కల్తీ మద్యం తీరును నిరసిస్తూ సోమ వారం తాడికొండ బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డైమండ్ బాబు మాట్లాడారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలో అనేక అక్రమాలకు పాల్పడిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు మద్యం షాపులను దక్కించుకున్నారని అన్నారు. కల్తీ మద్యం ఆ షాపులకు బెల్ట్ షాపులకు సరఫరా అవుతుందని అన్నారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు వంగా పోలా రెడ్డి, బాకీ వెంకటస్వామి, షేక్ ఖలీల్, షేక్ సాదిక్, పులి రమేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రజల కొనుగోలు శక్తికి దోహదం

విశాలాంధ్ర – గుంటూరు సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి దోహదపడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమ వారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో "జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల భవిష్యత్ ఆర్థిక ధోరణులు" అంశంపై నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబు లేసు అధ్యక్షతన ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌం టెంట్లు, వ్యాపారవేత్తలతో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు ప్రయోజనం కల్గేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, వ్యాపారస్తులు అధిక ధర వసూళ్లు చేయడానికి వీలు లేదన్నారు. ప్రభుత్వ మార్గ దర్శకాలను కచ్చితంగా పాటించని షాప్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చార్టర్డ్ అకౌంటెంట్స్ రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ, మధ్య తరగతి వారికి నిత్యావసర వస్తువులపై జీఎస్టీ రద్దు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ విజయ్ కుమార్, ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపార వేత్తలు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజి పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీలో రోటరాక్ట్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ - చార్టర్ ప్రెజెంటేషన్

విశాలాంధ్ర – మంగళగిరి : రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో రోటరాక్ట్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ – చార్టర్ ప్రెజెంటేషన్ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ రోటేరియన్ డాక్టర్ ఎస్వీ రామ్ ప్రసాద్ ప్రధాన అతిథిగా హాజరై కొత్తగా ఎన్నికైన క్లబ్ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. డిస్ట్రిక్ట్ చైర్(క్లబ్ అడ్మినిస్ట్రేషన్) పీడీజీ అన్నే రత్న ప్రభాకర్ విశిష్ట అతిథిగా, డిస్ట్రిక్ట్ రోటరాక్ట్ అడ్వైజరీ కమిటీ రీజినల్ చైర్ రోటేరియన్ జంగాల వెంకటేష్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరాక్టర్ జొన్నాదుల కేదారేశ్వరి లక్ష్మి అధ్యక్షురాలిగా, బండి సంజన కార్యదర్శిగా, చల్లా కార్తికేయ శ్రీరామ్ ట్రెజరర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షుడు రోటేరియన్ ప్రగడ రాజశేఖర్ అధ్యక్షత వహించగా, సెక్రటరీ పారేపల్లి నిరంజన్ గుప్తా, చైర్మన్ రోట్రాక్ట్ క్లబ్స్ జవ్వాది కిరణ్ చంద్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల తరపున సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాముల రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ బాబు రేఖా, కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో విద్యార్థులు ఎం.రవి, కె.భరత్, పి.నివేదిత స్ఫూర్తి, శ్రావణి సంధ్య, ఏ.ప్రతిమ, జె.రిషిత, యశ్వంత్, సిహెచ్ నాగేశ్వర రావు, నాని బాబు చురుకుగా పాల్గొన్నారు. కళాశాల సామాజిక సేవా కార్యకలాపాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ఎన్ఎస్ఎస్ యూనిట్ చేపట్టిన పర్యావరణ అవగాహన, ఆరోగ్య శిబిరాలు, సేవా ప్రాజెక్టులు ఆకర్షణగా నిలిచాయి.

అవయవదానంతో ఇద్దరు జీవితాల్లో వెలుగు నింపిన మహిళ

విశాలాంధ్ర – తాడేపల్లి : తాడేపల్లి నులకపేటకు చెందిన రాజులపాటి పాప(64) నులకపేట వద్ద ప్రమాదానికి గురి కాగా మెరుగైన వైద్యం కోసం వారి కుటుంబ సభ్యులు తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. రాజులపాటి పాప ఆరోగ్యపరిస్థితి చూసిన వైద్యులు తనకి బ్రెయిన్ శస్త్ర చికిత్సను నిర్వహించారు. అయినప్పటికి తన ఆరోగ్యపరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించలేదు.

వైద్యపరీక్షలు అనంతరం తనను బ్రెయిన్ డెడ్‌గా పరిగణించారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఆంధ్రప్రదేశ్ జీవన్ ధాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, హాస్పిటల్ డైరెక్టర్ రామాంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. దీనిలో కాలేయం తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించారు. కార్నియా ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ –విజయవాడకు తరలించారు. ఈ మంచి కార్యానికి ముందుకు వచ్చినందుకు దాత కుటుంబానికి మణిపాల్ హాస్పిటల్స్ కృతజ్ఞతలు తెలిపింది.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర – వినుకొండ : గుంటూరుకు చెందిన కోనాక్ డయాగ్నోస్టిక్స్ వారి సహకారంతో స్థానిక తారకరామా నగర్ కాలనీలో ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు అవగాహనా శిబిరాన్ని స్థానిక రోటరీ క్లబ్ నిర్వహించారు. ఇందులో దాదాపు 100 మంది రోగుల నుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. కోనాక్ లేబొరేటరీ మేనేజర్ సాయిబాబు రోగులకు షుగర్ , రక్తపోటు సంబంధిత వ్యాధుల గురించి వాటిపట్ల అప్రమత్తత గురించి రోగులకు అవగాహన కల్పించారు. క్లబ్ మాజీ అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు పరీక్షల కోసం వచ్చిన వారందరికీ తన పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు యేరువ వెంకటనారాయణ, కార్యదర్శి షేక్ బాజీ, కోశాధికారి పొత్తూరి నవీన్ సుధాకర్, రోటరీ జోనల్ చైర్మన్ (ఎన్విరాన్మెంట్ ఆలా శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ జిల్లా ముఖ్యులు ముత్తినేని గిరిబాబు, మాజీ అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత రెడ్డి, క్లబ్ మాజీ కార్యదర్శి గుత్తా గురు నాథం, మాజీ కోశాధికారి నాయబ్ రసూల్ , అడ్మినిస్ట్రేటర్ కూచి రామాంజనేయులు సభ్యులు నాగేంద్రుడు మాష్టారు, యువప్రసాద్ చైతన్య కరీముల్లా మాష్టారు, బీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, **MUKKA MANASA** (Old Name), W/o. **YELURI RAMAKRISHNA**, Resident of Door No:11-08-353, B1-C35, Ravindra Nagar, 3rd Line, Pattabhipuram, Guntur, Guntur District - 522006, Andhra Pradesh. I have changed my surname as **YELURI MANASA** (New Name) W/o. **YELURI RAMAKRISHNA**. Hereafter my surname is known as **YELURI MANASA** (New Name) W/o. **YELURI RAMAKRISHNA**.

దస్తావేజులు, బ్యాంకు పుస్తకాలు పోయినవి

గుంటూరుజిల్లా, అమృతలూరు మండలం ఇంటూరు గ్రామనివాసి కర్లపూడి సుభాషన్, తండ్రి డేవిడ్, డోర్ నెంబర్ 12-5-52 లో నివాసం ఉంటున్నాను. నా సోదరి కర్లపూడి అరుణకు సంబంధించిన నివేశ ఖాళీ స్థలం పెదగంకాని మండలం కొప్పురావూరి గ్రామ D.No. 68/D చదరపు గజాలు 253. 2/9 నివేశస్థలం. డాక్యుమెంట్ నెం. 489/1997, యూనియన్ బ్యాంకు అకౌంట్ నెంబర్: 023310100009928, స్టేట్ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 20150508636, ఏటీఎం కార్డులు ఫిక్సెడ్ డిపాజిట్ బాండ్లు తీసుకొని ది. 7-9-2025న గుంటూరు నుండి తాడికొండ బస్సులో వెళుతుండగా అడ్డరోడ్డు పరిసర ప్రాంతాలలో ఎక్కడో జారిపోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియ జేయగలరు. ఫోన్ నెంబర్ 9182979477

Before The Hon'ble District Consumer Disputes Redressal Commission at Guntur
C.C. No.261/2024

Between:
Lalith Kumar - Complainant
AND
The Authorized Authority, M/s.Voltas Limited,and Others - Opposite Parties
To,
Opp.No-2:
The Authorized Authority, M/s Voltbek home Appliances Pvt. Ltd, C/o TVS Supply Chain Solution Ltd, Rasheeda Godowns, Door No.4-98, Land Mark Beside Big Basket, Penamuluru, Mandalam, Gangur Village, Vijayawada.

పై నెంబరు C.C లో 2వ ఆపోజిట్ పార్టీ అయిన మీకు గౌరవ జిల్లా వినియోగదారుల కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరుచమని ఆర్డర్ వేయుగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:27-10-2025న ఉ. గం.10-30 ని.లకు పైన తెలిపిన శ్రీయుత గుంటూరు జిల్లా వినియోగదారుల కమీషన్ వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ తరపు అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీయుత జిల్లా వినియోగదారుల కమీషన్ వారి అనుమతితో)

వాయిదా తేదీ: 27-10-2025

కె.ఎ.విల్సన్, కంప్లైనెంటు తరపు అడ్వకేట్, 2/3 బ్రాడీ పేట, గుంటూరు.

బిల్లులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి : మేయర్

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధి లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బిల్లులను నిధి పోర్టల్ లో ఈ నెల 16వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బిల్స్ నిధి పోర్టల్లో అప్ లోడ్ అంశంపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తమ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మేయర్ పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు పారదర్శకంగా ఉండేందుకు నిధి పోర్టల్లో ఆన్ లైన్ ద్వారా అప్ లోడ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా అప్ లోడ్ చేయాలన్నారు. కమిషనర్ తొలుత ఏఈలు వారీగా జరిగిన పనులు, అప్ లోడ్ చేసిన బిల్లుల వివరాలను పరిశీలించి, మాట్లాడుతూ బిల్లులను నిధి పోర్టల్ ల్లో అప్ లోడ్ చేయడంలో ఏఈలు జాప్యం చేస్తున్నారని, 16వ తేదీ అనంతరం పెండింగ్ ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిధి పోర్టల్లో బిల్లుల అప్ లోడ్ లో ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబందిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వేగవంతంగా చేసేలా డిఈఈలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, వేణుగోపాల్, విష్ణు, డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మద్యం మాఫియాను నడుపుతున్న వైసీపీ, టీడీపీ

విశాలాంధ్ర - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ, టీడీపీలు కలిసి మద్యం మాఫియాను నడుపుతున్నాయని బీసీవై అధినేత బోడె రామచంద్రయాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కాకుండా నకిలీ మద్యం, డ్రగ్స్ చర్చలే వినిపి స్తున్నా యన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో ఆటలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు నకిలీ మద్యం గురించి మాట్లాడటమే ప్రజలకు హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ కంటై నర్ ఘటనపై కనీస విచారణ జరపలేదని అన్నారు. రాష్ట్రంలో గంజాయి, లిక్కర్ విక్రయాలు ఆగలేదని విమర్శించారు. ఐక్యరాజ్య సమితి ఎంపీల బృందంలో మిధున్ రెడ్డికి చంద్రబాబు సహకారం ఉందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్ కేసులో జైలుకెళ్లిన వ్యక్తిని యుఎన్ బృందంలో చేర్చడాన్ని సవాల్ చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి-చంద్రబాబు మధ్య రహస్య మైత్రి కొనసాగు తుందని, పెద్దిరెడ్డిపై ఏ కేసు నమోదు చేయకపోవడం దానికి నిదర్శనమ న్నారు. తంబళ్లపల్లి టిక్కెట్‌ను పెద్దిరెడ్డి బినామీ జయచంద్రారెడ్డికి ఇవ్వడం చంద్రబాబు సహకారంతోనే జరిగిందని చెప్పారు. బీసీల రక్షణ చట్టం తీసుకు రావడంలో చంద్రబాబు విఫలమయ్యారని, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించేందుకు చాగంటి కోటేశ్వర రావును సలహాదారుగా నియమించిన ప్రభు త్వం, ముందు టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు నైతిక పాఠాలు చెప్పాలని వ్యంగ్యంగా సూచించారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ

విశాలాంధ్రవి - దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల రైలుపేటలోని ఇందిరా గాంధీ బొమ్మ వద్ద కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సంతకాల సేకరణలో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా బోసు బొమ్మ సెంటర్ వద్ద నుంచి ర్యాలీగా దుకాణాలు వద్దకు వెళ్లి సంతకాలు సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి షేక్ సలీం, జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ మునీ,జిల్లా కాపు సంఘం చైర్మన్ రెమిడిశెట్టి హనుమంతరావు, మంగళగిరి మండల అధ్యక్షులు కృష్ణ చౌదరి,దుగ్గిరాల మండల మాజీ అధ్యక్షురాలు నెమలికంటి ఆదెమ్మ, మండల అధ్యక్షులు నెమలిగంటి ప్రసాదరావు,నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు ఆర్ల వెంకటస్వామి,జిల్లా ఎస్‌ఎస్సి ఉపాధ్యక్షులు బుల్ల సమర్పన్ కుమార్,మంగళగిరి మండల కార్యదర్శి రత్న గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ నిరాకరించినందుకు సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ మండలం కొండ కింద ఉప్పరపాలెం, వినుకొండ టౌన్ 1వ వార్డు వెన్నపూస కాలనీలో నివాసం ఉంటున్న యాదవ్ కులస్తులకు కులం సర్టిఫికెట్ ఇవ్వటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీని పై సోమవారం సిపిఐ పార్టీ వినుకొండ మండల కమిటీ ఆధ్వర్యంలో వినుకొండ తహసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ వినుకొండ మండల పార్టీ కార్యదర్శి కొప్పరపు మల్లికార్జున మాట్లాడుతూ. వినుకొండ మండలం కొండ కింద ఉప్పరపాలెం, వినుకొండ టౌన్ 1వ వార్డు వెన్నపూస కాలనీలో నివాసం ఉంటున్న యాదవ కులస్తులు వృత్తిరీత్యా గంగి రెద్దులాడిచ్చు కుంటూ జీవనం సాగిచ్చేవారని, కాలక్రమేనా గంగిరెద్దులు అంతరించిపోవటం వారంతా కూడా గ్యాస్ పొయ్యిలు రిపేర్ చేసుకుంటూ గ్రామాల్లో తిరుగుతూ, ఆకుకూరలు అమ్ముకుంటూ జీవనాలు సాగిస్తూ ఉన్నారు. వారంతా కూడా యాదవ్ కులం కు చెందిన వారిని, గంగిరెద్దులు అనేది వృత్తిరీత్యా గంగిరెద్దులు ఆడించే వాళ్లే తప్ప వారు గంగిరెద్దుల కులస్తులు కాదని, అధికారులు మాత్రం పూర్తిగా విచారించకుండా వారికి గంగిరెద్దుల కులం సర్టిఫికెట్ల మంజూరు చేస్తామని చెప్పటం ఎంత వరకు సబమని, వీరి ఇంటి పేరు ఉన్న తిరుమల, నల్లబోతుల, ఎద్దుపోలిబోయిన తది తర ఇంటి పేట వారందరికీ ఎర్ర గొండ పాలెం, సత్తెన పల్లి, బెల్లం కొండ, త్రిపురాంతకం మండలా ల్లో కూడా యాదవ కులస్తులుగా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటం జరిగిందని, వాటి ఆధారంగానే విచారించి వీళ్లకు కూడా యాదవ కుల స్తులుగా బీసీడీ కులం సర్టి ఫికెట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వినుకొండ తహసీల్దార్ సురేష్ నాయక్ కు గ్రామ ప్రజలతో వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిన్నబోయిన వెంకటేశ్వర్లు, రాయ బారం వందనం, ఎస్కు మస్తాన్, జల్లి వెంకటేశ్వర్లు, తిరుమల శీను, నల్లబోతుల శీను, తిరుమల లాజరు, తిరుమల రాజు, తిరుమల దుర్గా పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీస్

విశాలాంధ్ర - మంగళగిరి : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సీడీఎంకు ఈ నెల 10వ తేదీన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమ్మె నోటీసును అందజేశారు. ఆ నిర్ణయం ప్రకారం మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థలోని కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సోమవారం సంస్థ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు అందజేశారు.యూనియన్ నాయకులు మాట్లాడుతూ నవంబర్ 3నుంచి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా విధుల్లో మరణిం చిన, రిటైరైన కార్మికుల కుటుంబ సభ్యులను అవుట్సోర్సింగ్ విధానంలో నియమించాలని, డైలీ వేజ్ కార్మికులను అవుట్సోర్సింగ్ ద్వారా నియమించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 12వ పీఆర్సీ ప్రకారం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జనగణన ప్రకారం పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని, కార్మికుల బ్యాంక్ ఖాతాలను బలవంతంగా యాక్సిస్ బ్యాంక్‌కి మార్చరాదని స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ 7న ప్రభుత్వంతో జరిగిన ఒప్పం దాల ప్రకారం వేతనాలను పెంచి చెల్లించాలన్నారు. అవుట్సోర్సింగ్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగండికోట దుర్గారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు నందం బ్రహ్మేశ్వరరావు, తులసి, గండికోట కోటేశ్వరరావు,నరసయ్య,ఏఐటీయూసీ నాయకులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గుం టూరు సిటీ: గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ.తమీమ్ అన్సారియాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గుంటూరు శాఖ తరపున సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సమస్యలను, సంఘం తరపున నిర్వహించుచున్న సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ అధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వర్లు, సంఘ కార్యదర్శి లూర్దురెడ్డి, రాష్ట్ర సంఘ కోశాధికారి నాగరాజు, సభ్యులు రామకృష్ణ, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రాబందుల శాంతియాత్రలా వైసీపీ ధర్నాలు : జీవీ

కల్తీ మద్యం వ్యవహారంలో వైసీపీ విమర్శలపై చీఫ్ విప్ జీవీ ధ్వజం

విశాలాంధ్ర - వినుకొండ : కల్తీ మద్యం పేరిట రాష్ట్రంలో వైసీపీ ధర్నాలు రాబందుల శాంతియాత్రను తలపించినట్లుగా ఉందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. 2019 నుంచి 2024 మధ్య ప్రజల ప్రాణాలను పీక్కుతున్నది ఎవరో అందరికీ తెలుసన్నారు. ఆ ఐదేళ్లలో 32 వేల మంది మరణాలు, 35 లక్షల మందికి పైగా ఆస్పత్రుల పాలవ్వడం, కిడ్నీ, లివర్ కేసులు 30 శాతానికి పైగా పెర గడం నాటి పరిస్థితులకు నిదర్శనమని మండిపడ్డారు. సిట్ విచారణలో నాటి అక్రమాలు, అరాచకాలపై ఆధా రాలతో సహ అడ్డంగా దొరికారని తెలిపారు. ఇప్పుడు వాటిని కప్పిపుచ్చుకోవడానికే లేనిపోని రాద్ధాంతాలు, వారికి అలవాటైన అబద్ధపు ప్రచా రాలు చేస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. కల్తీ మద్యం అంటూ వైసీపీ చేస్తున్న విమర్శలు, పోరు బాటపై సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ మేరకు స్పందించారు. సిట్ తర్వాత ఇప్పటికే ఈడీ రంగప్రవేశం చేసిందని, వైసీపీ కోరుకుంటున్నట్లుగా సీబీఐ కూడా రావడం, వాళ్లనే జైలు లోకి నెట్టడం ఖాయమన్నారు. కల్తీ మద్యం కేసులో నింది తుడు జనార్దన్‌రావు చెప్పిన దాని ప్రకారం కల్తీ మద్యం తయారు జరిగింది వైసీపీ హయాంలోనే, దాని వల్ల లబ్ధి పొందింది కూడా ఆ పార్టీ నాయకుడు జోగి రమేష్ అని చెప్పినా కూడా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి సిగ్గుండాలని మండిపడ్డారు. కల్తీ మద్యం కేసులో నేడో రేపో జగన్‌రెడ్డి అరెస్టు ఖాయమని, అది సిట్ చేస్తుం దా? ఈడీ చేస్తుందా? సీబీఐ చేస్తుందో రాష్ట్ర ప్రజలే చూస్తారన్నారు. ఈలోపు సానుభూతి కోసం అరెస్టు ను ఆలస్యం చేయడం కోసం చిల్లర నాటకాలు ఆడుతున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూడా దీంట్లో మాట్లాడ టం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. వినుకొండ నియోజకవర్గం లో బెల్టు షాపులతో సమాంతర మద్యం వ్యవస్థను నడిపించింది బొల్లా బ్రహ్మనాయుడు కాదా అని ప్రశ్నించారు. సరఫరా చేసిన కల్తీ మద్యం మీద కూడా సీసాకు ఇంతని బీ ట్యాక్స్ వసూలు చేసిన విషయాన్ని మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు.

పెరుగు నాగేశ్వరరావుకు సీపీఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర - మంగళగిరి : పట్టణంలోని ద్వారకా నగర్‌కు చెందిన పెరుగు నాగేశ్వరరావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వర రావు, కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగే శ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, దేవర వెంకటేశ్వర రావు, చిన్ని సత్యనారా యణ, ఉయ్యాల సత్యనారాయణ, పేరుబోయిన ముక్కంటి, బాపనపల్లి శంకర్రావు, బాపనపల్లి కోటేశ్వరరావు, హనుమయ్య, మహమ్మద్ బేక్ తదితరులు ఉన్నారు.

సూపర్ జీఎస్టీ - అవగాహన బైక్ ర్యాలీ

విశాలాంధ్ర,ఉయ్యూరు : జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతుందని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహనలో భాగంగా సోమవారం ఎంపీడీవో శేషగిరిరావుతో కలిసి కడవకొల్లులో బైక్ ర్యాలీ నిర్వహించారు. చాలా వస్తువులపై ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ శాతం తగ్గించడం వల్ల ప్రజలకు కలిగే మేలే తెలియచేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూకల సాంబశివరావుకు సత్కారం

విశాలాంధ్ర,ఉయ్యూరు : బర్లింగ్టన్ స్టేట్ విశ్వవిద్యాలయం నుండి వ్యాపార, సామాజిక సేవాకార్యక్రమాలకు సం బధించి డాక్టరేట్ అందుకున్న సుధీర్ టింబర్ డిపో అధినేత, వాకర్స్ అసోసియేషన్ జిల్లా మాజీగవర్నర్ నూకల వెంకట సాంబశివరావును ఏజీ అండ్ ఎస్ జి కళాశాల వాకర్స్ అసోసియే షన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. మూడు దశాబ్దాలుగా వాణిజ్య, వ్యాపార, సామాజిక సేవాకార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొంటున్న సాంబశివరావు సేవలకు గుర్తింపుగా బర్లింగ్టన్ స్టేట్ విశ్వవిద్యాలయం ఢిల్లీలో ఏర్పాటుచేసే సిన ఇండియా ఇంటర్నేషనల్ డాక్టరేట్ ప్రధానోత్సవ కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ తో పాటు అవార్డుతో సత్కరించింది. ఈసందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సాంబశివరావును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. వ్యాపార వేత్త, లయన్స్ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ జిల్లా స్థాయిలో పదవులు అలంకరించి విశిష్ట సేవలందించిన సాంబశివరావు డాక్టరేట్ అందుకోవడం గర్వకారణమని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణ, బాపిరాజు కొనియాడారు. తులసీరామ్, వెం కటేశ్వరరావు, ఆంజనేయులు, మస్తాన్, కిషోర్, భాను తదితరులు పాల్గొని శుభాకాంక్ష లు తెలిపారు.

నకిలీమద్య పరిశ్రమలు నెలకొల్పిన కూటమి

విశాలాంధ్ర-ఉయ్యూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం తయారీకి ఏకంగా ఒక పరిశ్రమ తరహాలో ఫ్యాక్టరీలు నెలకొల్పి, దానికి మళ్ళీ బ్రాంచ్ లు ఏర్పాటు చేసి మరి సప్లై చేసే విధానం ఇటీవలే బట్టబయలైనది వైయస్సార్సీపి పెనమలూరు నియోజకవర్గం ఇంచార్జ్ దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గం మొదలుకుని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఇబ్రహీంపట్నం వరకు ఈ నకిలీ మద్యం దందా సాగుతుంది.ఇంకా బయటపడకుండా కొనసాగుతున్న నకిలీ మద్యం ఫ్యాక్టరీలు ఎన్ని ఉన్నాయనేది ప్రశ్నార్ధకమే అన్నారు. తక్షణమే ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు క్షమాపణలు చెప్పి, ఎక్సైజ్ శాఖ మంత్రి రాజీనామా చేయాలని, లేదా ప్రభుత్వమే వారిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.ఇటువంటి దుశ్చర్య పై తక్షణమే సిబిఐ విచారణ జరుపకుండా రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండే సిట్ తో విచారణ చేయించడం అంటే ఇది పక్కగా అసలు నిందితులని తప్పించడానికి, సమస్యని పక్క తోవ పట్టించడానికి చేస్తున్నారనేది స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రీజనల్ కార్డియాలజీ హెల్త్‌కేర్ లీడర్‌షిప్‌లో లైఫ్ లైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు అందుకున్న రమేష్‌బాబు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : అస్టర్ రమేష్ హాస్పిటల్స్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌లో చీఫ్ కార్డియాలజిస్టుగా సేవలందిస్తున్న డా?పోతినేని రమేష్ బాబు "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఇన్ రీజినల్ కార్డియాలజీ అండ్ హెల్త్‌కేర్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును వాయిస్ ఆఫ్ హెల్త్‌కేర్ (విఓహెచ్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బీట్ 2025 నేషనల్ కార్డియోవాస్కులర్ సమ్మిట్ %ం% అవార్డ్స్‌లో ప్రదానం చేశారు. ఈ సదస్సులో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ %ం% ఇనోవేషన్ రంగంలో ఫోర్టిస్ ఎస్కార్ట్ హార్ట్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ ప్రముఖ హృద్రోగ నిపుణులు డా? అశోక్ సేత్‌కు అందచేసారు.డా. రమేష్ బాబు నాయకత్వంలో అస్టర్ రమేష్ హాస్పిటల్స్ కార్డియాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి సంస్థగా ఎదిగింది. ఈ ఆసుపత్రి ఆధునిక గుండె చికిత్సలు, నివారణా కార్యక్రమాలు మరియు ప్రజా అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు .గత 37 సంవత్సరాలుగా హృద్రోగ వైద్యరంగంలో విశేష సేవలు అందించిన డా? రమేష్ బాబు ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి డిజిటల్ క్యాథ్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యదర్శిగా, టెలిమెడిసిన్ సేవలను మారుమూల ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.ఆరోగ్య సేవలలో వినూత్న ఆవిష్కరణలను అవలంబిస్తూ ప్రజల ఆరోగ్యానికి అంకితమైన సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డు ఆయనకు లభించిందన్నారు. ఈ అవార్డును డిల్లీ రాష్ట్ర సామాజిక, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, సహకారాల గౌరవనీయ మంత్రివర్యులు రవీందర్ సింగ్ అక్టోబర్ 12, 2025న న్యూఢిల్లీ లోని షాంగ్రి-లా ఎరోస్ హోటల్, జనపథ్‌లో జరిగిన ఘనమైన కార్యక్రమంలో ప్రదానం చేశారన్నారు. బీట్ 2025,నేషనల్ కార్డియోవాస్కులర్ సమ్మిట్ దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు, వైద్య శాస్త్రవేత్తలు, హెల్త్‌కేర్ లీడర్స్‌ను ఒకే వేదికపైకి తెచ్చి, గుండె సంబంధిత వ్యాధులను తగ్గించే వ్యూహాలు మరియు నూతన ఆవిష్కరణలపై చర్చించిందన్నారు. ఈ గౌరవం డా? పోతినేని రమేష్ బాబు జీవితకాల సేవలకు, కేంద్రీకృత వైద్యసేవల పట్ల ఆయన నిబద్ధతకు మరియు ప్రాంతీయ ఆరోగ్య రంగ అభివృద్ధిలో ఆయన అప్రతిహత పాత్రకు గుర్తింపుగా నిలిచిందన్నారు.

అఖిలభారత యోగా పోటీలకు కేబీఎన్ విద్యార్థులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాల యోగ పోటీలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అఖిల భారత పోటీలకు ఎంపికైనట్లు కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. సోమవారం కాలేజీలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 10వ తేదీన విజయవాడ పి.బి. సిద్ధార్థ కాలేజీలో యూనివర్సిటీ స్థాయి పోటీలు జరిగాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎండి. జీబా తహరీమ్ (ఫైనల్ బి ఎస్ సి బయో టెక్నాలజీ), ఎస్.కె. సమీరా (ఫైనల్ బి ఎస్ సి బయోటెక్నాలజీ), ఏం రాకేష్ (సెకండ్ బిఎస్సి ఎలక్ట్రానిక్స్), ఇ. నాని కృష్ణ చైతన్య (సెకండ్ బిఎస్సి డేటా సైన్స్), పి సత్యప్రసాద్ రాజు (డిప్లమా ఇన్ యోగ), వి. కుమార్ రాజు (సెకండ్ బీకాం కంప్యూటర్స్) అఖిల భారత పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబరులో ఎస్వీ వ్యాస యూనివర్సిటీ (బెంగళూరు)లో జరిగే పోటీల్లో మహిళల జట్టు, వేల్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (చెన్నై) లో జరిగే పోటీల్లో పురుషుల జట్టు పాల్గొంటున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావు, యోగా ట్రైనర్ వై.కె.ఎస్.డి. గౌరీనాథ్ లను అభినందించారు.

కోటక్ బిజ్‌ల్యాబ్స్ సీజన్-2 ప్రారంభం

విశాలాంధ్ర- గుంటూరు: కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ సీజన్-2 ప్రారంభిస్తున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ ప్రకటించింది. ఇది లోతైన మార్గదర్శకత్వం, మార్కెట్ యాక్సెస్, ఉత్ప్రేరక నిధులతో ప్రారంభ ఆదాయ దశ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి రూపొందించబడిన తన ప్రధాన సీఎస్ఆర్ చొరవ సాహసోపేత విస్తరణ. నవంబర్ వరకు జరిగే ఈ సీజన్-2 భారతదేశం అంతటా 75 పైగా స్టార్టప్‌లకు మద్దతు ఇస్తుంది. ఇది ప్రధానంగా డీప్-టెక్, సస్టైనబిలిటీ, క్లీన్ ఎనర్జీ, ఫిన్‌టెక్, డిజిటల్ టెక్నాలజీ, ఎడ్‌టెక్, అగ్రి టెక్, హెల్త్‌టెక్‌పై దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమం ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య భారతదేశంలో తన దేశవ్యాప్త ఉనికిని విస్తరిస్తుంది. ఇప్పటికే భాగస్వాములుగా ఉన్న ఐఐఎం వెంచర్స్, ఎన్ఎస్ఆర్‌సీఈఎల్-ఐఐఎం బెంగళూరు, టీ-హబ్ లతో పాటుగా ఐఐటీ ఢిల్లీకి చెందిన ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ను కొత్త ఇంక్యుబే షన్ భాగస్వామిగా స్వాగతించింది. కాగా, సీజన్-2 కోసం డీపీఐఐటీ-రిజిస్టర్డ్ స్టార్టప్‌లకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్ బాలాజీ



విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, డీఆర్ఓ కె. చంద్రశేఖర రావు, కేఆర్ఆర్‌సీఎస్డీసీ శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డీఓ స్వాతి, హౌసింగ్ పిడి పోతురాజు కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో మొత్తం 109 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కొంతమంది జిల్లా అధికారులు 16 అర్జీలు చూడలేదని, వెంటనే వారు అర్జీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ సిఎఫ్ఎంఎస్ ఐడి కలిగిన ప్రతి ఉద్యోగి ఐగాట్ కర్మయోగి కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ, ఖజానా, ఇంటర్ విద్య, దేవాదాయ, స్టేట్ ఆడిట్, ప్రజారోగ్యం, పౌరసరఫరాలు, రవాణా, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు వారికి కేటాయించిన కోర్సులు పూర్తి చేశారని అభినందించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ప్రయోజనాలు కల్పిస్తున్న భారతీయ స్టేట్ బ్యాంకు లేదా ఇండియన్ బ్యాంకుల్లో జీతం ఖాతా ఉండేలా చూడాలన్నారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గత నెల మూడో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల పరిష్కార దినం సందర్భంగా వచ్చిన 22 దరఖాస్తులకు సంబంధించిన చర్యలు, నివేదికలు రాలేదని, ముఖ్యంగా డీఆర్‌డిఏ, డిఎంహెచ్ఓ, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ కమిషనర్, పంచాయితీరాజ్, ఎక్సైజ్, బిసి, సర్వే తదితర శాఖల అధికారులు వెంటనే తగినచర్యలు తీసుకొని నివేదికలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి శివప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్ ఎస్ఈలు సోమశేఖర్, రమణ రావు, నీటిపారుదల శాఖ ఇంజనీరు కిరణ్ కుమార్, డిఎస్ఓ మోహన్ బాబు, డిపిఒ డా. జె. అరుణ, డీఈఓ పివిజె. రామారావు, డిఎంహెచ్ఓ డా. వెంకటరావు, సర్వే రికార్డుల ఏడి జోషిల, జిల్లా వ్యవసా అధికారి ఎన్. పద్మావతి, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి రమేష్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ముఖద్వార నిర్మాణ పనులు ప్రారంభించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర - పెదకూరపాడు : ఎంపీడీఓ కార్యాలయానికి ప్రధాన ముఖద్వారాన్ని ఏర్పాటు నిమిత్తం భూమి పూజ చేసి నిర్మాణ పనులను ఎంపీడీఓ శ్రీ లీల ప్రారంభించారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎంపీడీఓ ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. వైసీపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ సుభాని, సూపరింటెండెంట్ సోమయాజులు, పీఓపీ ఆర్డిఓ శరత్, అటెండర్ కార్తీక్, యోహాను పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - తాడికొండ : కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు రుణాలు ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి సొసైటీ, బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని అలాగే ఎరువులు పురుగు మందులను సబ్సిడిపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్ధార్ నిర్మల కృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు, బాణావతి భద్రయ్య, జోజి పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంకు బృందం సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన

విశాలాంధ్ర- పొన్నూరు : పొన్నూరు పట్టణంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రపంచ బ్యాంకు బృందం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలను డాక్టర్ ఫిరోజ్ ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల పరిసరాలు, ల్యాబ్, ఎక్సరే, జనరల్ వార్డ్, ఓపీ గది తదితరాలను పరిశీలించారు. రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా మందులు ఏ విధంగా ఇస్తున్నారని వివరాలు సేకరించారు. వైద్యశాలకు అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బ్యాంక్ బృందం డాక్టర్ మొహిర్ జోన్ అహ్మద్, డాక్టర్ హెడ్‌వార్డ్ రాఖి, గణేష్, మరిముత్తు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంతృప్తిని మెరుగుపరిచేలా ఫిర్యాదుల పరిష్కారం : డీఆర్వో ఖాజావలి

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: జిల్లాలో ప్రజలు నుంచి వివిధ శాఖలకు అందించిన ఫిర్యాదు అర్జీలను దరఖాస్తుదారుల సంతృప్తి స్థాయిని మరింతగా మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు, డ్వామా పిడి శంకర్ ప్రజల నుచి అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 228 అర్జీలు ప్రజలు అందించగా, వీటిని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, డిటిసి సీతారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీలో దొరికిపోయిన బీజేపీ: చిలకా విజయ్

విశాలాంధ్ర - తుళ్లూరు : దేశ వ్యాప్తంగా ఓటు చోరీ వ్యవహారంలో బీజేపీ పార్టీ ఎలక్షన్ కమిషన్‌తో కలిసి ఎలా కుట్ర పన్నిందో రాహుల్ గాంధీ పోరాటంతో ప్రతి ఒక్కరికి అర్థమైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకా విజయ్ అన్నారు. మండలంలోని రాయపూడి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడుసుమల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిలకా విజయ్ ఓటు చోరీ వ్యవ హారంపై ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు అప్రమత్త మవుతున్నాయని, తేలుకుట్టిన దొంగల్లా ఉన్నా లోలోపల ఓట్లను రీవెరిఫికేషన్ చేయించుకుంటున్నారని విమర్శించారు. షర్మిలమ్మ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా అత్యధిక సంతకాల సేకరణ ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడుసుమల్లి శ్రీనివాస్, బాలమంచ్, రాష్ట్ర అధ్యక్షులు బొర్రా రవిచంద్ర, వెలగలేటి కోటేశు , షేక్ నాగుల్‌మీరా, రెమిడిశెట్టి హనుమంతరావు, షేక్ మున్ని పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఫార్మసీ - అమెరికా టెంపుల్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, అమెరికా, పెన్సిల్వేనియా రాష్ట్రం, ఫిలడెల్ఫియాలోని టెంపుల్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికా టెంపుల్ యూనివర్సిటీతో ఫార్మ్.డీ ప్రోగ్రామ్‌కు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న భారతదేశంలోని మొట్టమొదటి సంస్థగా విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, అకాడెమిక్ పథకాలు చేపట్టడంతో పాటు, సాంస్కృతిక, ఇంటర్ డిసిప్లనరీ అవగాహనను పెంపొందించనున్నామని తెలిపారు. అలాగే పాఠ్య ప్రణాళికలను సంయుక్తంగా రూపకల్పన చేసి, అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్సులు నిర్వహించే యోచనలో ఉన్నామని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా రెండు దేశాల విద్యాసంస్థల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడతాయని, విద్యార్థులు, అధ్యాపకులు ప్రపంచస్థాయి అనుభవాలు, పరిశోధనల్లో పాల్గొనే అవకాశాలు పొందుతారని తెలిపారు. టెంపుల్ యూనివర్సిటీ 1884లో స్థాపించబడిన 130 సంవత్సరాలకు పైబడిన చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత ఉన్నత విద్యాసంస్థగా డాక్టర్ రత్తయ్య తెలిపారు. ఈ విశ్వవిద్యాలయంలో 30,000 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇటలీ, జపాన్‌లలో కూడా దీని క్యాంపసులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికాలోని జాతీయ విశ్వవిద్యాలయాల్లో టాప్ 50 పబ్లిక్ స్కూల్స్, టాప్ 100 నేషనల్ యూనివర్సిటీల్లో స్థానం సంపాదించిందని, 17 కాలేజీలు, 640కి పైగా అకాడెమిక్ ప్రోగ్రామ్‌లు కలిగి ఉండి, ఆర్1 రీసెర్చ్ క్యాటగరీలో ఉందని తెలిపారు. ఈ అవగాహన ఒప్పందాన్ని సాధ్యమయ్యేలా చేసినందుకు ఫార్మ్.డీ ప్రోగ్రాం డీన్ డాక్టర్ సతీష్, ఎస్.గొట్టిపాటిని, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల కాకుండా ప్ట ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన, ఆరోగ్యశ్రీ సేవల నిలుపుదల వంటి చర్యలతో వైద్య ఆరోగ్య రంగంలో సంక్షోభం నెలకొని ఉందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్య సేవల నెట్‌వర్క్ ఆసుపత్రులు శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశామని, మరోపక్క తగు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నార న్నారు. సీజనల్ జ్వరాలు, ఇతర రోగాలు పట్టిపీడిస్తున్న సమయంలో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం బాధాకరమని, ఈ స్థితి ఉత్పన్నం కావటానికి ప్రభుత్వమే కారణమన్నారు. త్వరితగతిన ఈ పరిస్థితిని చక్కదిద్దకపోతే అనారోగ్యాంధ్రప్రదేశ్‌గా దిగజారవచ్చని, ప్రమాధ ఘంటికలు మోగకముందే ప్రభుత్వ పెద్దలు మేలుకోవటం అవసరమని తెలిపారు. బకాయిల పాపం గత ప్రభుత్వానిదేనని తప్పించుకోవటం సబబు కాదని, ప్రస్తుతం అధికారంలో ఎవరుంటే వారిదే బాధ్యత అని, నెపాలు మోపటం కాకుండా వైద్య సేవలు ఉచితంగా అందించేలా చేయాలని శివరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆహ్లాదాన్ని అందించే మొక్కలు నాటాలి : కమిషనర్

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: గుంటూరు నగరంలో రోడ్ల కు ఇరువైపులా, డివైడర్లలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఆహ్లా దాన్ని అందించే మొక్కలను నాటా లని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఉద్యావన విభాగ, ఇంజి నీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ జెకెసి కాలేజీ రోడ్, సమ్మర్ పేట, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఈ సీజన్‌లో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా వార్డ్ ల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. నగర పాలక సంస్థ ఉద్యానవన అధికారులు ప్రధాన రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మొక్కలను విరివిగా నాటాలన్నారు.

సూపర్ జీఎస్టీ గిఫ్ట్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

ఎంపీడీఓ సుగుణ

విశాలాంధ్ర - దుర్గి : విద్యా రంగానికి, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ గిఫ్ట్ ఇచ్చిందని ఎంపీడీఓ పి.సుగుణ అన్నారు. ఎంపిపి యేచూరి సునీత సాయి శంకర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ప్రవేశ పెట్టిందన్నారు. సోమవారం స్థానిక మం డల పరిషత్ కార్యాలయం నుంచి ముటుకూరు రోడ్డు వరకు సూపర్ సేవిం గ్స్‌పై సచివాలయ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి రేట్లు తగ్గుదల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జీ డిప్యూటీ ఎంపీడీఓ రాజు, మనోజ్, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ బెంజిమెన్, స్వర్ణ ఏడుకొండలు, రామ కృష్ణ, చేన్నూరి యమున, పృథ్వీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుభానిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర - తాడికొండ : కొండ పోరంబోకు భూమిలో అక్రమంగా బ్రిక్స్ పరిశ్రమ పెడుతున్న లాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు షేక్ సుభానిపై అదే గ్రామానికి చెందిన షేక్ ఆదిల్ అనే వ్యక్తి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని సర్వే నెంబర్ 199/ఏలో కొండ పోరంబోకు భూమి ఉంది. రూ.20 కోట్లు విలువ చేసే భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా బ్రిక్స్ పరిశ్రమ పెడుతున్నాడు. లంచాలకు మరిగిన పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. గతంలో 40 మంది పేదలు ఇల్లు నిర్మించుకుంటే కోర్టుకు వెళ్లి వాటిని కూల్చి వేయించాడు. ఇప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని సుభాని అదే తప్పు చేస్తున్నాడు. అధికారులు సైతం అతనికి వత్తాసు పలుకుతున్నారు. విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న సుభానిపై చర్యలు తీసుకోవాలని ఆదిల్ ఫిర్యాదు చేసాడు.

అమరేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు

విశాలాంధ్ర-అమరావతి : శైవక్షేత్రాలలో ప్రథమ శ్రేణిలో విరాజల్లుతున్న అమరావతిలోని శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా శివ కేశవులకు శతవిద్యాభిషేకాలు, అలానే శ్రీ బాల చాముండిక అమ్మవారికి కుంకుమ అర్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, ఆలయ కార్యకార నిర్వహణ అధికారిని కె.రేఖ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో వచ్చే ఏకాదశిలో కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారాలు మినహాయించి మాసంలోని అన్ని రోజులలో స్వామివార్లకు బిల్వార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివార్లకు అభిషేకాలు, కుంకుమార్చన, బిల్వాభిషేకాలు నిర్వహించే భక్తులు ఆలయంలోని ఆలయ కార్యనిర్వహణ అధికారి రేఖను సంప్రదించాల్సిందిగా కోరారు.